22 నుంచి దసరా సెలవులు

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు ఈ నెల 22 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు దసరా సెలవులు ప్రకటించినట్లు శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ తెలిపారు. అక్టోబరు 3వ తేదీ నుంచి పాఠశాలలు పునఃప్రారంభమవుతాయని ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈ ఉత్తర్వులను పాటించాలని డీఈవో శామ్యూల్ పాల్ పేర్కొన్నారు.

జీడీపీ నుంచి హంద్రీకి నీటి విడుదల


జీడీపీ గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న నీరు

గోనెగండ్ల, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి శనివారం మధ్యాహ్నం హంద్రీ నదికి జీడీపీ నాలుగో గేటు ఎత్తి 500 క్యూసెక్కుల నీటి విడుదల చేసినట్లు ఏఈ మహమ్మద్ ఆలీ తెలిపారు. శుక్రవారం మద్దికెర, తుగ్గలి, పత్తికొండ, ఆస్పరి, దేవనకొండ తదితర ప్రాజెక్టు ఎగువ ప్రాంతాలలో ఒక మోస్తారు వర్షం కురియడంతో అదేరోజు రాత్రి నుంచి 500 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు వచ్చి చేరుతోందన్నారు. ప్రస్తుతం గాజులదిన్నెప్రాజెక్టులో నీటి మట్టం పూర్తి స్థాయిలో ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. శనివారం సాయంత్రానికి నీటి మట్టం 376.80 మీటర్లు ఉందని తెలిపారు. జీడీపీ పూర్తిస్థాయి నీటి మట్టం 377 మీటర్లు అయితే ప్రస్తుతం కేవలం 0.20 మీటర్ల మాత్రమే తక్కువ ఉన్నట్లు అధికారులు వివరించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

- ఎస్పీ విక్రాంత్ పాటిల్



కర్నూలు క్రైం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లాలోని సబ్ డివిజన్లు, పోలీస్ హెడ్‌క్వార్టర్స్, సర్కిల్ పోలీస్ స్టేషన్లలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఆయా పోలీస్ స్టేషన్ల పరిసరాలను పరిశుభ్రం చేశారు. అనంతరం పిచ్చిమొక్కలను తొలగించారు. పర్యావరణాన్ని కలుషితం చేసే పరిసరాలను శుభ్రంగా ఉంచడం బాధ్యతగా తీసుకోవాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ, సీఐలు, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య

నేటి విద్యార్థులే రేపటి ఉద్యోగులు.. అందుకే.. వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలే లక్ష్యంగా క్లస్టర్ విశ్వవిద్యాలయం నూతన కోర్సులను ప్రవేశపెట్టింది. మారుతున్న కాలానికి అనుగుణంగా, పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా పరిస్థితులు, సాంకేతిక పరిజ్ఞానం, విద్యా ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుని 2024-25 విద్యా సంవత్సరం నుంచి నూతన స్వయం ఆధారిత (సెల్ఫ్ ఫైనాన్స్) కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ కోర్సులు విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపచడంలో ఎంతగానో దోహదపడతాయి. ఈ దిశగా ఆధునిక టెక్నాలజీతో కూడిన సరికొత్త కోర్సులు విద్యార్థులకు అందుబాటులో ఉండేలా క్లస్టర్ విశ్వవిద్యాయం రిజిస్ట్రార్ జి.శ్రీనివాసులు పక్కా ప్రణాళికతో నిబద్ధతగా కృషి చేస్తున్నారు.

- కర్నూలు అర్బన్ (ఆంధ్రజ్యోతి)


క్లస్టర్ వర్సిటీలో నూతనంగా ప్రారంభమైన లైబ్రరీ

ఆధునిక కోర్సులతో బంగారు భవిత..

ప్రస్తుతం పీజీ 17, డిగ్రీలో 9 హానర్స్, 11 ఇంటిగ్రేటెడ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. బీఎస్సీలో కంప్యూటర్ సైన్సు, మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ, బాటనీ, మైక్రో బయాలజీ, బయోటెక్నాలజీ, హోంసైన్సు, డేటా సైన్సు, ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఆర్గానిక్ ఫార్మింగ్, బీకాం జనరల్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్ స్టాటిస్టిక్స్, బీఏ లో హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్సు, స్పెషల్ ఇంగ్లీష్, స్పెషల్ తెలుగు, స్పెషల్ ఉర్దూ సబ్జెక్టులు మేజర్, మైనర్‌గా ఉన్నాయి. ఈ సబ్జెక్టులతో పాటు అదనంగా మల్టీ డిసిప్లీనరీ కోర్సు (ఎండీసీ), స్కిల్ ఎబిలిటీ ఎన్‌హాన్స్‌మెంట్ కోర్సులు ప్రవేశపెట్టారు.

- సరికొత్త కోర్సులతో ఉపాధి, ఉద్యోగావకాశాలు
- ఆధునిక టెక్నాలజీపై ప్రత్యేక దృష్టి
- ప్రత్యేకంగా నిలుస్తున్న క్లస్టర్ వర్సిటీ

కనీస సౌకర్యాలపై దృష్టి

క్లస్టర్ వర్సిటీ పరిధిలోని కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాల, సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలల్లో ఉన్న విభాగాలను బలోపేతం చేయడంతో పాటు నూతన విభాగాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. విద్యార్థులకు ఆధునిక బోధనా పద్ధతులను అందించాలనే లక్ష్యంతో తరగతి గదులను స్మార్ట్ క్లాస్ రూములుగా మార్చడంతో పాటు డిజిటల్ బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు. నాణ్యమైన విద్య, మౌలిక సదుపాయాల కల్పన దిశగా ప్రత్యేక దృష్టి సారించారు.

పరిశోధన రంగాలకు సహకారం

ఇతర యూనివర్సిటీలు, సంస్థలతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంటోంది. తద్వారా విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధన ప్రాజెక్టులలో పాలు పంచుకోవడానికి, నూతన విషయాల అధ్యయనానికి అవకాశం లభిస్తుంది. ఇప్పటికే పలు యూనివర్సిటీలు, సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సంస్థలతో ఒప్పదం కుదుర్చుకునే అవకాశం ఉంది.



24 గంటలూ లైబ్రరీ అందుబాటులో..

విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యంగా వర్సిటీలో 24 గంటలు లైబ్రరీ అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు. వేలాది పుస్తకాలు, సాంకేతిక పరమైన కంప్యూటర్లు, మారుతున్న కాలానికి తగ్గట్టుగా విద్యార్థులకు ప్రతి కోర్సుకు అవసరమైన పుస్తకాలను సమకూర్చారు. సిల్వర్ జూబ్లీ డిగ్రీ రెసిడెన్షియల్ కళాశాల విద్యార్థులకు ఈ లైబ్రరీ ఎంతగానో అవసరమైన బండాగారంగా కేవలం గత నెల రోజుల్లో ఈ లైబ్రరీని నూతనంగా అందుబాటులోకి తెచ్చారు.

క్లస్టర్ అభివృద్ధికి కృషి



క్లస్టర్ విశ్వవిద్యాలయం అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తున్నాం. సమగ్రాభివృద్ధి దిశగా చర్యలు చేపడుతున్నాం. నూతన కోర్సులతో విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. ఉపాధి కల్పనే లక్ష్యంగా కొత్త కోర్సులు ప్రవేశపెట్టాం. ఆధునిక సాంకేతికతో కూడిన సౌకర్యాలు అందిస్తున్నాం. వర్సిటీని మరింత ఆదర్శవంతంగా తీర్చిదుద్దుతాం.

- రిజిస్ట్రార్ శ్రీనివాసులు

ఉల్లి రైతులకు ఊరట

- హెక్టారుకు రూ.50వేల ఆర్థిక సాయం
- జాయింట్ కలెక్టర్ నవ్య



కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా ఉల్లి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ఊరట కల్పించింది. ఉల్లిని సాగు చేసిన రైతులకు నేరుగా హెక్టారుకు రూ.50వేల చొప్పున వారి బ్యాంకు అకౌంట్లలో జమ చేయడానికి ప్రభుత్వం నిర్ణయించిందని జాయింట్ కలెక్టర్ నవ్య తెలిపారు. శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వం ప్రకటించిన నిర్ణయంలో భాగంగా సోమవారం నుంచి క్వింటాకు రూ.1,200 మద్దతు ధర అమలులో ఉండదని స్పష్టం చేశారు. రైతులు తమ ఉల్లి పంటను గ్రామాల్లోనే తమ పొలాల్లో లేదా లోకల్ ట్రేడర్స్ వద్ద, ఇతర మార్కెట్‌లలో ఎక్కడ మంచి ధర వస్తే అక్కడ అమ్ముకోవచ్చని వివరించారు. మార్కెట్ యార్డులో అమ్ముడుపోని ఉల్లిని రైతులు తీసుకెళ్లి ఎక్కడైనా అమ్ముకునే అవకాశం ఉంటుందన్నారు. భారీ వర్షాలు లేదా వరదలు వస్తే విపత్తు సాయంగా హెక్టారుకు రూ.25వేలు మాత్రమే ఇప్పటి దాకా మంజూరు చేయడం జరిగేదని, కానీ ప్రస్తుతం ఉల్లి రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెట్టింపు మొత్తంతో అంటే హెక్టారుకు రూ.50వేల ఆర్థిక సాయాన్ని అందిస్తామని ప్రకటించారన్నారు. సోమవారం నుంచి మార్కెట్ యార్డులో ఉల్లి విక్రయాలు వ్యాపారుల ద్వారా జరుగుతాయని మార్క్‌ఫెడ్ ద్వారా అమ్మకాలు జరగవని జాయింట్ కలెక్టర్ తెలిపారు. ఆదివారం కర్నూలు మార్కెట్ యార్డుకు సెలవు ప్రకటించామని, రైతులు ఈ విషయాన్ని గమనించి మార్కెట్ యార్డుకు ఉల్లిని తీసుకురావద్దని జాయింట్ కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

కర్నూలు మార్కెట్ యార్డుకు 17,351 క్వింటాళ్ల ఉల్లి

- యార్డు చరిత్రలో ఇదే మొదటిసారి


మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ జయలక్ష్మి

కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీలో శనివారం రికార్డు స్థాయిలో ఉల్లి చేరింది. మొత్తంగా 17,351 క్వింటాళ్ల ఉల్లి మార్కెట్‌కు వచ్చినట్లు మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ జయలక్ష్మి తెలిపారు. గతంలో ఎప్పుడూ ఇలా రాలేదని ఈ మొత్తంలో 10,960 క్వింటాళ్ల ఉల్లిని వ్యాపారులతో కొనుగోలు చేయించామన్నారు. 1,194 క్వింటాళ్ల ఉల్లిగడ్డలను మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసి రాష్ట్రంలోని వివిధ రైతుబజార్లకు సరఫరా చేసిందన్నారు. 5,197 క్వింటాళ్ల ఉల్లిని, రెండో విడత టెండర్ నిర్వహించామని, ఈ మొత్తం ఉల్లిగడ్డలను వ్యాపారులే కొనుగోలు చేశారన్నారు. ప్రస్తుతం కర్నూలు మార్కెట్ యార్డులో రైతులు తెచ్చిన ఉల్లిగడ్డలు అమ్మకానికి ఏమీ లేవని స్పష్టం చేశారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు మార్క్‌ఫెడ్ సంస్థ కొనుగోలు చేసిన ఉల్లిగడ్డలను ఆదివారం ఉదయం 10 నుంచి అమ్మడానికి వేలం నిర్వహిస్తున్నామని, ఒక బస్తా ఉల్లిగడ్డలు రూ.100కు అమ్మేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు

శ్రీశైలంలో దసరా మహోత్సవాలకు సిద్ధం: ఈవో



శ్రీశైలం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో ఈనెల 22 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు జరగబోయే దసరా మహోత్సవాలకు సర్వం సిద్ధం చేసినట్లు దేవస్థానం ఈవో శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆలయ పరిపాలనా భవనంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 22న ఉదయం 9.00 గంటలకు అమ్మవారి ఆలయ యాగశాల ప్రవేశంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. అక్టోబరు 1వ తేదీ మహర్నవమి రోజున రాష్ట్ర ప్రభుత్వం వారిచే స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాణరెడ్డి హాజరవుతారని తెలిపారు. అక్టోబరు 2 విజయదశమి సందర్భంగా సాయంకాలం నిర్వహించే తెప్పోత్సవంతో ఉత్సవాలు ముగియనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో ఆర్.రమణమ్మ, ఏఈవో హరిదాసు, ప్రజాసంబంధాల అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

8 గేట్లతో శ్రీశైలం రిజర్వాయర్ నీటి విడుదల

శ్రీశైలం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం రిజర్వాయర్‌కు నీటి ప్రవాహం పోటెత్తడంతో ఇంజనీర్లు 8 గేట్లను ఒక్కొక్కటి 10 అడుగుల ఎత్తు మేరకు తెరిచి స్పిల్‌వే గుండా 2,22,032 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. శనివారం సాయంత్రం 6 గంటల సమయానికి డ్యాం నీటిమట్టం 884 అడుగులు ఉండగా నీటినిల్వ సామర్థ్యం 211 టీఎంసీలుగా ఉంది. శ్రీశైలం రెండు జలవిద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి అనంతరం జెన్‌కో అధికారులు 65,890 క్యూసెక్కులు విడుదల చేశారు.



స్తంభించిన రిజిస్ట్రేషన్ సేవలు

- రెండో రోజూ డాక్యుమెంట్ రైటర్ల పెన్‌డౌన్


నిరసన తెలుపుతున్న డాక్యుమెంట్ రైటర్లు

కల్లూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా శనివారం రిజిస్ట్రేషన్ సేవలు స్తంభించిపోయాయి. ప్రతిరోజూ క్రయ, విక్రయాలతో సందడిగా ఉండే కార్యాలయాలు కళావిహీనంగా దర్శనమిచ్చాయి. రిజిస్ట్రేషన్ శాఖలో నూతన విధానాల్లో లోపాలు సరిచేయాలని కర్నూలు డాక్యుమెంట్ రైటర్లు జిల్లా ఆఫీసు ముందు రెండో రోజూ నిరసన చేపట్టారు. ప్రభుత్వం అమలు చేస్తున్న కఠినమైన పీడీఈ, ఆటో మ్యుటేషన్ , స్లాట్ బుకింగ్ విధానం వల్ల ప్రజలు, డాక్యుమెంట్ రైటర్లు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. అన్నివర్గాల ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఓటీపీ విధానం రద్దు, ఈ-స్టాంప్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఏ రహమాన్ , ఎండీ.రఫిక్, చందు, రామకృష్ణ, హనుమంతరావు, నాగేశ్వ, భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురు పోలీసులకు పదోన్నతి

కర్నూలు క్రైం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆయా పోలీస్ స్టేషన్‌లలో పని చేస్తున్న ఏడుగురు కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి కల్పిస్తూ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

పేరు	ప్రస్తుత స్థానం	కేటాయించిన జిల్లా
ఎస్.లక్ష్మణ నాయక్	పీసీఆర్, కర్నూలు	నంద్యాల
జి.శ్రీనివాసులు	పత్తికొండ యూపీఎస్	నంద్యాల
వి.బాల రమేష్	కర్నూలు తాలుకా యూపీఎస్	నంద్యాల
యు.అశోక్ కుమార్	ఆదోని వన్‌టౌన్ యూపీఎస్	నంద్యాల
ఎస్.ఖలందర్ షాన్	కర్నూలు వన్ టౌన్ యూపీఎస్	నంద్యాల
ఎస్.గిరిబాబు	కర్నూలు ట్రాఫిక్ పీఎస్	నంద్యాల
బి.పరుశురాం	ఆదోని త్రీటౌన్ యూపీఎస్	నంద్యాల

భూగర్భ జలాలను పెంచాలి : కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూగర్భ జలాలను గణనీయంగా పెంచాలని కలెక్టర్ సిరి సూచించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లోని కార్యాలయంలో జలవరుల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టుల పురోగతి, సాగునీటి సదుపాయాలు, నిల్వ, నీటి పంపిణీ ప్రణాళికలు, కావాల్సిన ఏర్పాట్లపై వివరాలను తెలుసుకున్నారు. ప్రజలకు తాగునీటి ఇబ్బంది తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా నింపుతున్న 40 ట్యాంకులకు అదనంగా మిగిలిన 206 చెరువులను నింపడానికి తీసుకోవాల్సిన చర్యలు, ఖర్చు వివరాలను నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్ఈ బాలచంద్రా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన ఎంపీడీవోలకు పోస్టింగ్

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవోలుగా పదోన్నతి పొందిన ముగ్గురికి పోస్టింగ్ ఇస్తూ జడ్పీ సీఈవో జి.నాసరరెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం ఆరుగురు పరిపాలన అధికారులకు పదోన్నతి లభించగా ముగ్గురికి మాత్రమే పోస్టింగులు ఇచ్చారు. డ్వామాలో పని చేస్తున్న టి.క్రిష్ణమోహన్ శర్మను గూడూరు, పాములపాడులో పని చేస్తున్న గాయత్రికి బండిఆత్మకూరు, మహనంది డిప్యూటీ ఎంపీడీవో పి.నాగేంద్రుడుకు ఆత్మకూరుకు నియమించారు. కాగా మిగిలిన ముగ్గురు అధికారులు పి.దస్తగిరిబాబు, ఎస్.నాగరాజు, రామక్రిష్ణవేణికి ఇంకా పోస్టింగ్ ఇవ్వలేదు. ఈ క్రమంలో నంద్యాల జిల్లా అవుకు, కొలిమిగుండ్ల, బనగానపల్లె, కర్నూలు జిల్లా ఓర్వకల్లు, కోసిగి మండలాల్లో ఎంపీడీవో పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

పోలీస్ స్టేషన్‌లోని బైక్‌లను అమ్మేసిన కానిస్టేబుల్

- పోలీసు తనిఖీల్లో బయటపడిన గుట్టు
- విధుల నుంచి సస్పెండ్, కేసు నమోదు


కానిస్టేబుల్ జగదీష్

కోడుమూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): కోడుమూరు పోలీసు స్టేషన్‌లోని వివిధ కేసుల్లో పట్టుబడిన బైక్‌లను ఓ కానిస్టేబుల్ దర్జాగా అమ్మేశాడు. స్టేషన్‌కు వచ్చిన సొమ్ము మనదే అనుకున్నాడో ఏమో కానీ.. ఏకంగా ఐదు ద్విచక్ర వాహనాలను అమ్ముకుని జల్సా చేశాడు. ఇందుకు సంబంధించిన వివరాలు... కోడుమూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో సుమారు 40 బైక్‌లు సీజ్ అయ్యాయి. ఎన్నో ఏళ్ల నుంచి స్టేషన్‌లోనే బైక్‌లు ఉండటం వలన ఒకవైపు స్టేషన్ ఇరుకుగా మారింది. మరో వైపు బైక్‌లు తుప్పు పడిపోతున్నాయి. దీంతో స్టేషన్‌లోని ఉన్నతాధికారులు ఒక నిర్ణయానికి వచ్చారు. బైక్‌లను యజమానులకు వాళ్ల బైక్‌లను తిరిగి వాళ్లకే అప్పగించాలని నిర్ణయించుకున్నారు. ఇందు కోసం స్టేషన్‌లోని జగదీష్ అనే కానిస్టేబుల్‌ను నమ్మి బాధ్యతను అప్పగించారు. నిబంధనలకు అనుగుణంగా అన్ని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి యజమాని చేత సంతకం చేయించుకొని బైక్ అప్పగించాలని ఆదేశించారు. అయితే ఆ కానిస్టేబుల్ అధికారుల నమ్మకాని వమ్ము చేసి 5 బైక్‌లను రూ.2లక్షలకు ఇతరులకు అమ్ముకున్నాడు. ఇందులో కానిస్టేబుల్ జగదీష్‌తో పాటు ఒక హోంగార్డు కూడా ప్రధాన పాత్ర పోషించినట్లు సమాచారం.

ఐదు బైక్‌ల్లో ఒక బైక్‌ను కొన్న ఒక వ్యక్తి అదే బైక్‌పై కర్నూలుకు వెళ్తుండగా కె.నాగలాపురం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. బైక్‌కు సంబంధించిన పత్రాలను పోలీసులు అడిగితే తాను కోడుమూరు పోలీసు స్టేషన్‌లో బండిని కొనుగోలు చేశానని చెప్పడంతో గుట్టురట్టుగా మారింది. దీంతో సమాచారం అందుకొన్న సీఐ తబ్రేజ్, ఎస్ఐ డీవై స్వామి విచారణ చేపట్టారు. విచారణలో మొత్తం 5 బైక్‌లను విక్రయించినట్లు గుర్తించారు. వెంటనే ఆ బైక్‌లను రికవరీ చేసి ఉన్నతాధికారుల దృష్టికి సీఐ మహ్మద్ తబ్రేజ్ తీసుకెళ్లారు. కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నామని ఉన్నతాధికారుల మేరకు జగదీష్‌ను సస్పెండ్ చేసినట్లు తెలిపారు.




ఉల్లి రైతులను ఆదుకునేందుకు సీఎం కృషి
• మంత్రి టీజీ భరత్
7
అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

తుంగభద్ర తీరం

సాహిత్యం

మహాత్ముని అడుగుజాడల్లో నంద్యాల గాంధీ పాదముద్రలు



కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నేటితరంలో చారిత్రక స్పృహ తగ్గిపోతోంది. తమ మూలాలను కానీ, తమ ప్రాంత అస్తిత్వం గురించి తెలుసుకోవాలనే ఆసక్తి, జిజ్ఞాస యువతలో కనిపించడం లేదు. తమ ప్రాంతం సామాజికంగా, సాంస్కృతికంగా ఎలా అభివృద్ధి చెందిందో తెలుసుకోవాలంటే...ఆ ప్రాంతాలకు చెందిన కొంతమంది మహనీయుల జీవిత చరిత్రలను అధ్యయనం చేయాల్సి ఉంటుంది. రాయలసీమకే గర్వకారణమైన మచ్చలేని స్వచ్ఛమైన గాంధేయవాది, నంద్యాల ప్రజానీకంచే 'నంద్యాల గాంధీ'గా వినతికెక్కిన స్వాతంత్ర్య సమరయోధుడు కాదర్‌బాద్ నరసింగరావు. ఈ మహనీయుని జీవిత చరిత్రే 'నంద్యాల గాంధీ' పుస్తకం. శతాధిక గ్రంథ రచయిత, విద్వాన్ గొట్టిముక్కల సుబ్రహ్మణ్యశాస్త్రి ఈ పుస్తకాన్ని రాశారు. నంద్యాల గాంధీని తెలుసుకోవాలంటే 1888-1963 మధ్య కాలంలో నంద్యాల సామాజిక, సాంస్కృతిక వైవిధ్యాన్ని తెలుసుకోవడమే అవుతుంది. నరసింగరావు 1920-1934 వరకు నంద్యాల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులుగా సుదీర్ఘకాలం పనిచేశారు. నిరంతరం గాంధీజీ అడుగుజాడల్లో నడుస్తూ 'స్వచ్ఛమైన గాంధేయవాది'గా ఆయన కీర్తి గడించాడు. ఆయన సమాజానికి చేసిన సేవలకు, రాజకీయాల్లో ఆయన నెరపిన పెద్దరికానికి ముగ్ధుడైన ఆంధ్రా తిలక్ గాడిచర్ల హరిసర్వోత్తమరావు నరసింగరావుకు 'నంద్యాల గాంధీ' అని నామకరణం చేశారు.

కాదర్‌బాద్ నరసింగరావు తన కృషిని కేవలం స్వాతంత్ర్య పోరాటానికే పరిమితం చేయలేదు. సామాజిక సేవల వైపు కూడా అడుగులు వేశాడు. నంద్యాలలో విద్యావ్యాప్తికి నాలుగు ఎకరాల సొంత భూమిని విరాళంగా అందజేశారు. నేడు ఆ పాటశాలనే 'కాదర్‌బాద్ నరసింగరావు స్మారక పురపాలక ఉన్నత పాఠశాలగా ఎందరో విద్యార్థులకు చదువుల బాట పట్టిస్తోంది. అణగారిన వర్గాల పిల్లల అభ్యున్నతికి 1947లో 300 మందికి వసతి కల్పించే విధంగా హరిజన హాస్టల్‌ను, పేద బాలికల కోసం ప్రత్యేక హాస్టల్‌ను ఆయన నెలకొల్పారు. మరోవైపు నాణ్యమైన విత్తనాలు, సాగునీటి సౌకర్యం, గిట్టుబాటు ధరలు కల్పించడం, కందూనదిపై వారధి నిర్మాణం వంటి అనేక కార్యక్రమాలు చేపట్టారు. గాడిచర్ల హరిసర్వోత్తమరావుతో కలిసి 'శ్రీబాగ్ ఒడంబడికను రూపొందించడంలో కూడా ఆయన ప్రముఖపాత్ర పోషించారు. ఆనాటి నంద్యాల ప్రజల జీవన స్థితిగతులు, సాంఘిక జీవనం, స్వాతంత్ర్య ఉద్యమ ప్రభావం వంటి పలు చారిత్రక అంశాలను తెలుసుకోవడానికి 'నంద్యాల గాంధీ' పుస్తకం ఒక దిక్సూచిగా నిలుస్తుంది. ఇది అన్ని ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రాల్లో లభిస్తోంది.



- డాక్టర్ నీలం వెంకటేశ్వర్లు, సాహితీ విమర్శకులు, నంద్యాల

భాష కోసం పాతికేళ్లుగా ఉద్యమాలు



జేఎస్ఆర్‌కే శర్మ


- మాతృభాషా వికాసానికి 200పైగా రథయాత్రలు
- కర్నూలులో భరతమాత ఆలయ నిర్మాణంలో ముఖ్య భూమిక
- తెలుగుతల్లి, శ్రీకృష్ణరాయల విగ్రహాల స్థాపనకు కృషి
- జిల్లా సాహిత్యరంగంలో 'తెలుగు శర్మ' ప్రత్యేక గుర్తింపు

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యంలో అనేక సందేహాలను నివృత్తి చేసుకునేందుకు జిల్లా సాహితీవేత్తలు ఆయన్ను ఆశ్రయిస్తారు. మాతృభాషకు సంబంధించిన ఏ అంశంలోనైనా సందేహం వస్తే భాషావేత్తలు ఆయననే సంప్రదిస్తారు. ఎందుకంటే మాతృభాష, సాహిత్యం ఆయన తన రెండు కళ్లుగా భావిస్తూ, నిత్యం అందులోనే మునిగితేలుతుంటారు. అంతేకాదు, తల్లిభాషకు రక్షణ ఛత్రం పట్టేందుకు 'తెలుగు భాషా వికాస ఉద్యమం' సంస్థను నెలకొల్పి, ఆ సంస్థ పేరుతో గత పాతికేళ్లుగా ఉద్యమాలు చేస్తూనే ఉన్నారు. 200పైగా రథయాత్రలు చేపట్టి రాయలసీమలోని జిల్లాల్లో పర్యటనలు చేశారు. 300పైగా పుస్తకాలకు వ్యాసాలు, సమీక్షలు, పీఠికలతో పాటూ స్వయంగా అనేక పుస్తకాలు రాసి వెలువరించారు. కర్నూలు నగరంలో దేశభక్తితో భరతమాత ఆలయాన్ని దేశంలోనే మొట్టమొదటిసారిగా నిర్మించి ప్రజల్లో దేశభక్తిని చాటి చెప్పారు. నగరంలో తెలుగుతల్లి, శ్రీకృష్ణదేవరాయల విగ్రహాల స్థాపనలోనూ ముఖ్యభూమిక పోషించారు. సుదీర్ఘ ఆధునిక జిల్లా సాహిత్య రంగంలో తనకుంటూ ఒక ముద్ర వేసుకున్న ఆయనే జగర్లపూడి సీతారామకృష్ణ శర్మ. సాహితీవేత్తలంతా ఆయన్ను జేఎస్ఆర్‌కే శర్మ అని పిలుచుకున్నా...దివంగత డాక్టర్ సి.నారాయణరెడ్డి మాత్రం ఆయనకు 'తెలుగు శర్మ' అని నామకరణం చేశారు. భాషా, సాహిత్యంపై ఆయనకు ఉన్న మమకారానికి గుర్తుగా ఏనాడో డాక్టర్ సినారె పెట్టిన పేరే...నేటి జిల్లా సాహిత్యలోకానికి ఆయన తెలుగు శర్మగానే పరిచితులుగా నిలుస్తున్నారు.

ప్రకాశం జిల్లాలోని తర్లుపాడు గ్రామానికి చెందిన జగర్లపూడి పుల్లయ్య శర్మ, రాజ్యలక్ష్మి దంపతులకు ఏకైక సంతానంగా 1944 మార్చి 25న జన్మించిన జేఎస్ఆర్‌కే శర్మ ప్రాథమిక విద్య ఆ గ్రామంలోనే చదువుకున్నారు. కనిగిరిలో 1962లో టీచర్ ట్రైనింగ్ కోర్సు పూర్తి చేసి 1963 డిసెంబరులో ఉపాధ్యాయ వృత్తిలో చేరారు. కర్నూలు జడ్పీలో నియామక ఉత్తర్వులు తీసుకుని పత్తికొండ సమితిలోని కొత్తపల్లి ఎరుకల గుడిసెలు ప్రాంతంలో ఉపాధ్యాయునిగా చేరారు. అయితే పాఠశాలలో అన్ని కులాల వారిని సమానంగా కూర్చొబెట్టడం కూడా తలనొప్పి అయింది. అయితే అందులో తన మాటతీరుతో విజయం సాధించారు. పత్తికొండ సమితిలో 15 ఏళ్లుగా ఉపాధ్యాయులకు ప్రొబేషన్, రెగ్యులైజేషన్ కాకపోవడంతో తిరిగి ఉద్యమబాట పట్టి దాన్ని సాధించారు. అనంతరం ఉద్యోగం కొనసాగిస్తూనే బీఎడ్, ఎంఏ, పీజీ డిప్లమో ఇన్‌కన్నడ పూర్తి చేశారు. 1970లో గ్రేడ్‌వన్‌తెలుగు పండిట్‌గా జోహరాపురం, అనంతరం డిపెప్‌లో కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారిగా, జిల్లా బాలకల విద్యాభివృద్ధి అధికారిగా పనిచేసి 2002లో పదవీ విరమణ చేశారు.

భరతమాత ఆలయ నిర్మాణం...

విశ్వ హిందూ పరిషత్‌భావజాలంతో ప్రభావితమైన జేఎస్ఆర్‌కే శర్మ కర్నూలు, కడప, అనంతపురం జిల్లాల విభాగ్ ప్రముఖ్‌గా పనిచేశారు. అదే సమయంలో కర్నూలు, నంద్యాల జిల్లా కేంద్రాల్లో భరతమాత ఆలయాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అలా నగరంలోని నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలో భరతమాత ఆలయం నిర్మించారు. నంద్యాల్లో ఆలయ నిర్మాణానికి స్థలాన్ని సేకరించి ఇచ్చారు. అలాగే నగరంలో కొండారెడ్డి బురుజు సమీపంలో తెలుగుతల్లి విగ్రహ స్థాపన, కిసాన్ ఘాట్ సమీపంలో శ్రీకృష్ణదేవరాయల విగ్రహ స్థాపనకు ఎంతో శ్రమించారు.



జేఎస్ఆర్‌కే శర్మ రాసిన పుస్తకాల్లో కొన్ని...



'భువన విజయ ప్రబంధ సంక్షిప్త సంకలనం

రచనలు ఎన్నో... పురస్కారాలు మరెన్నో...

జేఎస్ఆర్‌కే శర్మ తన సుదీర్ఘ సాహిత్య ప్రస్థానంలో 300పైగా పుస్తకాలకు వ్యాసాలు, పీఠికలు, ముందుమాటలతోపాటూ అనేక పుస్తకాలు స్వయంగా రాసి వెలువరించారు. తెలుగు భాష వికాస ఉద్యమం - గమ్యం-గమనం పుస్తకం విశేష ఆదరణ పొందింది. అలాగే వందే భారత మాతరం, దేశంకోసం, సహృదయ గీతికలు, కర్నూలు జిల్లా సాహితీ విశేషాలు, జిల్లా కవితరంగిణి, శ్రీకృష్ణదేవరాయలు, పింగళి సూరన సాహితీవైభవం వంటి గ్రంథాలను ముద్రించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడి 1983లో, రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డులను దక్కించుకున్నారు.

సాహితీ రంగంలో ఇలా...

పత్తికొండలో తెలుగు ఉపాధ్యాయులను, భాషాభిమానులను ప్రోగు చేసి 'లలిత కళాసమితి' పేరుతో అనేక కార్యక్రమాలు నిర్వహించారు. అనేక మంది కవులను ఆహ్వానించి సాహితీగోష్టులు, చర్చాగోష్టులు, పుస్తక ఆవిష్కరణ చేపట్టారు. ఆలూరు తాలూకాలో పనిచేస్తున్నప్పుడు డాక్టర్ సి.నారాయణరెడ్డి, గంధ్లూరి దత్తాత్రేయ శర్మ, గడియారం రామకృష్ణశర్మ, కలుగోట్ల విజయ దత్తాత్రేయ వంటి పండితులతో కార్యక్రమాలు చేపట్టారు. ఎమ్మిగనూరులో జాతీయ సాహిత్య పరిషత్తు మహాసభలను దిగ్విజయంగా నిర్వహించారు. అలాగే ప్రాచీన సాహిత్య పరిషత్‌సంస్థను స్థాపించి వందలాదిగా కార్యక్రమాలు చేపట్టారు. 1996లో స్త్రీ స్ఫూర్తి అనే పత్రిక స్థాపించి, 2017 వరకు కొనసాగించారు. 1998లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన తెలుగు కళాసమితికి కార్యదర్శిగా సేవలు అందించారు. 2000 సంవత్సరంలో డిపెప్‌లో పనిచేస్తున్నప్పుడు అక్షర అనే పత్రిక సంపాదకుడిగా జిల్లా ప్రాథమిక విద్యా పథకం కార్యక్రమాలను ముద్రించారు. 2000 సంవత్సరంలో తెలుగు భాషా వికాస ఉద్యమం సంస్థను చేపట్టి, రాష్ట్ర వ్యాప్తంగా అనేక కార్యక్రమాలు నిర్వహించారు.

'రోబోట్' నైపుణ్యంతో మెరుగైన భవిష్యత్తు



మాట్లాడుతున్న శాస్త్రవేత్త నాని

పాణ్యం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రోబోట్‌లపై నైపుణ్యం పెంపొందించుకుంటే మెరుగైన భవిష్యత్తు ఉంటుందని బెంగళూరు డీఆర్‌డీవో శాస్త్రవేత్త నాని మేడిచర్ల అన్నారు. శనివారం ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో ఏఐఎంఎల్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ సాంకేతిక సదస్సు అమోఘ 2కె25ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగ నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. ఏఐఎంఎల్ విభాగానికి సంబంధించి ఆర్ఓఎస్ ల్యాబ్‌లో ఉత్తమ సాంకేతికత ఉన్న రోబోట్‌లపై నైపుణ్యం పెంపొందించుకోవాలన్నారు. సదస్సులో రోబోట్‌ను ప్రదర్శించారు. హైదరాబాద్ డెల్ టెక్నాలజీస్ శాస్త్రవేత్త నరేష్‌బిల్లా, ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్, హెచ్‌వోడీ కిశోర్‌కుమార్, కోఆర్డినేటర్ హరగోపాల్, హైదరాబాద్ రోబో మిరాకిల్ నిర్వాహకుడు రియాజ్ షేక్ అహ్మద్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సహనమే శాంతికి మార్గం



- విస్మరిస్తే.. వినాశనానికి దారి
- నేడు అంతర్జాతీయ శాంతి దినోత్సవం

ఆత్మకూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మానవ సహనమే ప్రపంచ శాంతికి మార్గంగా నిలుస్తుందని మేధావులు చెబుతుంటారు. మనిషి తన మనస్సును ఆధీనంలో ఉంచుకోలేని క్రమంలో అసహనానికి గురైతే హింసా మార్గం వైపు నడవాల్సి వస్తోంది. క్షణికావేశంలోనే తీసుకునే కఠిన నిర్ణయాలు పెను విపత్తులకు దారితీస్తాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రపంచంలో శాంతియుత వాతావరణం కోల్పోయి ప్రజలు అశాంతికి గురికావాల్సి వస్తోంది. శాంతియుత విధానాల వల్ల కలిగే సత్ఫలితాలను ప్రపంచానికి చాటి చెప్పాలన్న తలంపుతో ప్రపంచస్థాయిలో కాల్పుల విరమణ, అహింస, శాంతి, సోదరభావాల సాధన కోసం ప్రతిఏటా సెప్టెంబరు 21న అంతర్జాతీయ శాంతి దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ప్రపంచంలోనే ఎటువంటి అల్లర్లు, ఘర్షణలు తావులేకుండా శాంతియుత జీవనానికి ప్రజానీకం మొగ్గుచూపాలన్న ఆకాంక్షతో శాంతి కపోతాలు ఎగరవేసి శాంతిపట్ల ప్రజల్లో అవగాహన కల్పించేలా ప్రతిఏటా ఓ నినాదంతో ఈ దినోత్సవాన్ని దేశాలన్ని.. ఆనవాయితీగా జరుపుతున్నారు.

1981లో సెప్టెంబరు 21న ఐక్యరాజ్య సమితి సాధారణ సమావేశం ప్రారంభమైన సందర్భంగా కోస్టారికా సమర్పించిన తీర్మానం ప్రకారం ప్రకారం ప్రతి ఏటా సెప్టెంబరు 21వ తేదిన ప్రపంచ శాంతి దినంగా జరుపుకోవాలని ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశం ప్రకటించింది. సర్వత్రా శాంతియుత భావాలను బలోపేతం చేయడానికి గానూ ప్రపంచ శాంతి దినాన్ని అంకితం చేయాలని ఆయా దేశాల ప్రతినిధులు నిర్ణయించారు. తొలి ప్రపంచ శాంతి దినాన్ని 1982 సెప్టెంబరులో నిర్వహించగా, 2002లో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సెప్టెంబరు 21వ తేదిన అంతర్జాతీయ శాంతి దినోత్సవ నిర్వహణకు శాశ్వత తేదీగా నిర్వహించారు. 60దేశాల ప్రజలు విరాళంగా ఇచ్చిన నాణేలతో ఒక పెద్ద శాంతి గంటను తయారు చేసి యునైటెడ్ నేషన్స్ అసోసియేషన్ ఆఫ్ జపాన్ ఐరాసకు బహుకరించారు. న్యూయార్క్‌లోని ఐరాస కేంద్ర కార్యాలయం ఆవరణలోని వెస్ట్‌కోర్ట్ తోటలో ఈ గంటను ఏర్పాటు చేశారు. ప్రతి సంవత్సరం శాంతి దినోత్సవానికి సంబంధించిన కార్యక్రమాలు ఈ గంట మ్రోగించిన తర్వాత దీని సమీపంలోనే నిర్వహిస్తారు.

రాగచైత్ర అసాధారణ ప్రతిభ

- ఏకంగా ఏడు బహుమతులు కైవసం



బహుమతులతో రాగచైత్ర

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పోటీలంటే ఆ బాలికకు అమితానందం. ఒకటి కాదు..రెండుకాదు ఏకంగా ఏడు బహుమతులు కైవసం చేసుకుని అందరినీ అబ్బురపరచింది. జిల్లా చరిత్రలో ఇంతటి ఘనత ఎవరికీ దక్కలేదని నిరూపించింది. నంద్యాల పట్టణంలోని గుడ్‌షెపర్డ్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న రాగచైత్ర ఈ ఘనత సాధించింది. ఇటీవల నంద్యాలలో రాష్ట్ర సాంస్కృతిక సంస్థ, కళారాధన ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో రాగచైత్ర నాలుగు ప్రథమ, రెండు ద్వితీయ, ఒకటి నాలుగో స్థానం బహుమతులు కైవసం చేసుకుంది. గత 25ఏళ్ల కళార్చన పోటీల్లో ఏడు బహుమతులు సాధించిన ఘనత రాగచైత్రదే. రాగచైత్ర పోటీల్లో చలనచిత్ర విశ్లేషణ, తెలుగు హ్యాండ్ రైటింగ్, ఇంగ్లీష్ హ్యాండ్ రైటింగ్, చిత్ర విశ్లేషణలో మొదటి బహుమతి, లెటర్ రైటింగ్, స్పాట్ డ్రాయింగ్ పోటీల్లో ద్వితీయ బహుమతి, డ్రాయింగ్ పోటీలో 4వ బహుమతి సాధించింది. రాగచైత్ర అసాధారణ ప్రతిభను ప్రముఖులు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

అంతరించిపోతున్న పగటి వేషాలు..!

కళ

- వారి వేషం గంభీరం.. బతుకు భారం..
- పూట గడవని స్థితిలో పగటి వేషగాళ్లు
- తరాలుగా ఇదే వృత్తిని నమ్ముకున్న కళాకారులు



కోసిగిలో పగటి వేషం వేస్తున్న కళాకారులు

కోసిగి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): దసరా వచ్చిందంటే సంబరాలే కాదు. ముఖాలకు రంగులు వేసుకుని వివిధ రకాల వస్త్రధారణతో వచ్చే పగటివేషగాళ్లు కూడా. పగటి వేషాల గురించి ప్రస్తుత సిటీ జనరేషన్‌కు పెద్దగా తెలియకపోవచ్చు. వారి వేషాలు ప్రజా వినోదం ప్రధాన ఆశయం. ప్రజల ఆశలకూ, ఆశయాలకు దర్పణంగా పేరొందాయి. ప్రత్యేకంగా పగటిపూట వివిధ రకాల వేషాలతో వచ్చి అలరిస్తుంటారు... అందుకే వారిని పగటి వేషగాళ్లు అంటారు. పగటి వేషాల్లో ఉండే గొప్పతనం ఇతరులను నమ్మించడం, ఒకనాటి పరిపాలకుల దృష్టికి ప్రజల సమస్య సమస్యలను తీసుకురావడం, వర్తమానాలను చేరవేయడం. కానీ ప్రస్తుతం తరం వాళ్లు పగటి వేషగాళ్లు అంటే ప్రస్తుత తరం వాళ్లు యాచకులుగా చూస్తున్నారు. నిజానికి పగటి వేషాల లక్ష్యం వ్యంగం. వీరికి రంగస్థలం అంటూ లేదు. ఇంటిగడప, వీధులు, సందులు అన్నీ వీరికి రంగస్థల వేదికలే. ప్రదర్శన సమయాల్లో ప్రేక్షకులు, ప్రదర్శకుల మధ్య ఎలాంటి వ్యత్యాసం చూపరు. పురాణ గాథలను, ఆ గాథల్లోని వారిని తమ వేషాలతో ప్రదర్శిస్తుంటారు. హార్మోనియం, తబలా వంటి వాద్యాలతో పాటు యక్షగాన శైలిలో వీరి ప్రదర్శన ఉంటుంది. కానీ పగటి వేషగాళ్లు అక్కడక్కడ అరుదుగా కనిపిస్తూ అంతరించిపోతున్న కళను కాపాడుతున్నారు. ప్రస్తుత సమాజానికి కొన్ని కళారూపాలు దూరం అవుతున్నాయి. వాటిలో ప్రధానంగా ఉన్నది పగటి వేషాలే. వీరిని ఆదరించేవారు, అభిమానించేవారు కరువవుతున్నారు. వీరికి ఆదరణ లేకపోతే పగటివేషాలు ఇకపై పగటి కలలుగా మారే అవకాశం ఉంది. కోసిగిలో అంతరించి పోతున్న కళకు జీవం పోస్తూ కొందరు కళాకారులు ప్రదర్శనలు ఇస్తున్నారు. తాతల కాలం నాటి పగటి వేషాలను తండ్రులు, కొడుకులు కూడా వేస్తూ పూట గడపడం కోసం వేస్తున్నామనీ పగటి వేషగాళ్ల కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని కళాకారులు తులసీరామ్, రంగస్వామి, హార్మోన్ శంకరప్ప, రాము అమరేష్, మారెప్పలు ఆవేదన వ్యక్తం చేశారు.



హార్మోనియం వాయిస్తున్న కళాకారుడు శంకరప్ప కౌతాళం మండలం, ఉరుకుంద

- ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలి

తాతాల కాలం నుంచి మా తండ్రులు, మేము పగటివేషగాళ్లతోనే జీవనం పొందుతున్నాము. ప్రభుత్వం పగటి వేషగాళ్ల గుర్తించి మాకు న్యాయం చేయాలి.. బేడ బుడగ జంగం అయిన మేము ఆర్థికంగా చాలా వెనుకబడ్డాం. జీవనోపాధి కోసం పగటి వేషాలు వేస్తున్నాం.

- తులసీరామ్, కళాకారుడు

తాతల కాలం నుంచి ఇదే జీవనోపాధి



తాతల కాలం నుంచి మా తండ్రులు, మేము పగటి వేషాలే తప్ప మరో ఉపాధి లేదు. మేము మా వేషాలు గంభీరంగా ఉన్నా బ్రతుకు మాత్రం దుర్భరంగా భారంగా ఉంది. ప్రతి నెలా పించన్లు ఇచ్చి ప్రభుత్వం మా కళాకారులను గుర్తించాలి.

- రంగస్వామి, కళాకారుడు

సమాజాన్ని మేల్కొలుపుతూ...

పగటి వేషగాళ్లు ప్రధానంగా జానపద కళారూపకమైన పగటి వేషాన్ని ప్రదర్శిస్తారు. పగటి వేష కళాకారులు ఒకే ప్రదర్శనలో అనేక రకాల పాత్రలను, స్త్రీ పురుష వేషాలను ధరించి వినోదంతో పాటు సామాజిక, సాంస్కృతిక అంశాలను ప్రజలకు అర్థమయ్యేలా చెప్పడం వీరి లక్ష్యం. సమాజంలోని అట్టడుగు వర్గాల నుంచి వచ్చి సంస్కృతిని పరిరక్షిస్తున్నారు. ఇతర కళారూపాలకు భిన్నంగా వీరు ఎలాంటి సుదీర్ఘ ప్రారంభాలు లేకుండా నేరుగా వేషంలోకి ప్రవేశించి ప్రజలకు అనుగుణంగా ప్రదర్శనలు కొనసాగిస్తారు. తెలుగు రాష్ట్రాల్లో పగటి వేషం అంటారు. కర్ణాటకలో పగలు వేసిన ఆట.. తమిళనాడులో పగలు వేశం.. వంటి రాష్ట్రాల్లో కూడా పగటి వేషాలతో రాణిస్తున్నారు. ప్రాచీన కాలంలో అనేక పగటి వేషాలు ప్రదర్శించబడేవి. కానీ అన్ని వేషాలు ఇప్పుడే వేయడం లేదు. కారణం జీవనంలో వచ్చిన మార్పులే అని చెబుతున్నారు.



భీముడు వేష ధారణలో కళాకారుడు తులసీరామ్, కౌతాళం మండలం, ఉరుకుంద

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

కోవెలకుంట్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఓ కౌలు రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం కోవెలకుంట్లలో చోటు చేసుకుంది. ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి వివరాల మేరకు.. కోవెలకుంట్ల పట్టణంలోని ఎల్ఎం కాంపౌండుకు చెందిన కోగిల చంద్రశేఖర్ (50) అనే వ్యక్తి సుమారు 15 ఎకరాలు కౌలుకు తీసుకుని వివిధ పంటలను సాగు చేశాడు. పెట్టుబడి కోసం సుమారు రూ.16లక్షలు అప్పు చేశాడు. పంట సరిగా పండకపోవడంతో నష్టం వాటిల్లింది. దీనికి తోడు ట్రాక్టర్ లోను తీసుకున్నాడు. అప్పులు తీర్చలేననే మనస్తాపంతో చంద్రశేఖర్ శుక్రవారం రాత్రి పట్టణంలోని జీసీఆర్ పెట్రోలు బంకు సమీపంలో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని కుమారుడు రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉరి వేసుకుని వ్యక్తి..

బండిఆత్మకూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): భార్య కాపురానికి రాలేదని ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ఈర్నపాడు గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ జగన్మోహన్ కథనం మేరకు... గ్రామానికి చెందిన కేశవ్ (28) అనే వ్యక్తి ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందాడు. మృతుడికి ముగ్గురు పిల్లలు ఉన్నారని, తండ్రి వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

యర్రగుంట్ల గ్రామంలో..

శిరివెళ్ల, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రగుంట్ల గ్రామానికి చెందిన గని తిమ్మరాజు(42) అనే వ్యక్తి శనివారం చెట్టుకు ఉరేసుకుని మృతి చెందాడు. శిరివెళ్ల ఎస్ఐ చిన్న పీరయ్య తెలిపిన వివరాల మేరకు.. హమాలీ పని చేసుకుని జీవనం సాగిస్తున్న తిమ్మరాజు మద్యానికి బానిసై కుటుంబాన్ని పట్టించుకోకుండా ఉండేవాడన్నారు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది గ్రామంలోని ఓ పాఠశాల పక్కన ఉన్న ముళ్లపొదల్లో చెట్టుకు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడినట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి భార్య సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

విద్యుదాఘాతంతో బాలుడు..

ఆత్మకూరు రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముష్టపల్లి గ్రామానికి చెందిన యుగంధర్ నాయక్ (12) శనివారం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని ముష్టపల్లికి చెందిన శివకృష్ణ నాయక్ కుమారుడు యుగంధర్‌నాయక్ శనివారం తమ ఇంటి పరిసరాల్లోని జామ చెట్టుపై జామ కాయలు తెంచేందుకు చెట్టు ఎక్కాడు. ఆ చెట్టుపై ఉన్న విద్యుత్ వైర్లు తగిలి షాక్‌కు గురై ఒక్కసారిగా చెట్టుపై నుండి కింద పడి పోయాడు. హుటాహుటిన ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు బాలున్ని తరలించారు. కాగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. చేతికి అంది వచ్చిన కుమారుడు మృత్యువాత పడటంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగి పోయింది. సీఐ రాము ప్రభుత్వ ఆసుపత్రి చేరుకుని వివరాలను తెలుసుకున్నారు.

రెండు బైకులు ఢీ..
ముగ్గురికి గాయాలు

కొత్తపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాపరం మలుపు వద్ద ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. శనివారం కొత్తపల్లి మండలంలోని బట్వారుపల్లి నుంచి తిమ్మరాజు, రాముడు ద్విచక్రవాహనంపై ఆత్మకూరు వస్తున్నారు. అలాగే బండి ఆత్మకూరు మండలం నారాయణపురం గ్రామానికి చెందిన నందయ్య, మల్లయ్య మండలంలోని గోకవరం గ్రామానికి ద్విచక్రవాహనంపై వస్తున్నారు. మార్గమధ్యలోనే లింగాపురం-కొత్తపల్లి గ్రామాల మలుపు వద్ద ప్రమాదవశాత్తు రెండు బైకులు ఢీకొన్నాయి. దీంతో తిమ్మరాజు, నందయ్య, మల్లన్నలకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులను ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు రెఫర్ చేసినట్లు తెలుస్తోంది.

కర్ణాటక ఆర్టీసీ బస్సు, వాహనం ఢీ

మంత్రాలయం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం సమీపంలో అభయాంజనేయ స్వామి దేవాలయం వద్ద కర్ణాటక ఆర్టీసీ బస్సును బొలేరో లగేజ్ వాహనం ఢీకొట్టింది. దీంతో డ్రైవర్ సాహేర బాషాకు గాయాలయ్యాయి. ఈరోడ్డు ప్రమాదం శనివారం రాత్రి జరిగింది. మంత్రాలయం హెడ్ కానిస్టేబుల్ మల్లికార్జునస్వామి తెలిపిన వివరాల ప్రకారం కర్ణాటక మైసూర్ డిపోకు చెందిన బస్సు రోడ్డు పక్కన పార్కింగ్ చేశారు. నందవరంకు చెందిన బొలేరో వాహనం రాయచూరులో పత్తిలోడు దించి మంత్రాలయానికి వస్తుండగా బస్సును ఢీకొట్టింది. దీంతో బస్సుకున్న డీజల్ ట్యాం కు పగిలిపోయింది. బొలేరో డ్రైవర్ సాహేర బాషాకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న మంత్రాలయం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలించారు.

వీడిన విద్యార్థిని కిడ్నాప్ మిస్టరీ

చాగలమర్రి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): చాగలమర్రిలో విద్యార్థిని కిడ్నాప్ మిస్టరీ వీడింది. చాగలమర్రి గ్రామంలోని పెద్దమకానం సమీపంలోని ఓ కళాశాలలో డిగ్రీ చదువుతున్న విద్యార్థినిని గుర్తు తెలియని వ్యక్తులు గురువారం కారులో తీసుకెళ్లి కిడ్నాప్ చేసిన సంఘటన తెలిసిందే. విద్యార్థిని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆరా తీశారు. విద్యార్థిని సెల్‌ఫోన్ లోకేషన్ ఆధారంగా కడపలో ఉన్నట్లు గుర్తించారు. వారిని ఆళ్లగడ్డ రూరల్ పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చి సీఐ, ఎస్ఐ విచారించారు. అనంతరం చాగలమర్రి తహసీల్దార్ వద్ద బైండోవర్ చేయించారు. అనంతరం విద్యార్థినిని ఆమె తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

ద్విచక్రవాహనాల దొంగ అరెస్టు

- రూ.5 లక్షల విలువజేసే 4 వాహనాలు స్వాధీనం



ద్విచక్రవాహనాల దొంగ అరెస్టును చూపుతున్న పోలీసులు

గోనెగండ్ల, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాల దొంగలపై గోనెగండ్ల పోలీసులు డేగ కన్నువేశారు. గత జూన్ 18న రూ. 30లక్షలు విలువ చేసే 35 వాహనాలను స్వాధీనం చేసుకొని ఒకరిని అరెస్టు చేయగా శనివారం మరో ద్విచక్రవాహన దొంగను అరెస్టు చేశారు. దొంగ దగ్గర నుంచి రూ. 5లక్షల విలువ చేసే 4 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గోనెగండ్ల సీఐ విజయభాస్కర్ వివరాల మేరకు.. బెళగల్ మండలం పోలుకల్లు గ్రామానికి చెందిన ఉప్పరి వీరేశ్ కొంత కాలంగా బస్టాండ్, దేవాలయాలు, ఇండ్లముందు, హోటళ్ల ముందు నిలిపిన ద్విచక్ర వాహనాలను దొంగలించే వాడు. గత కొంత కాలంగా ద్విచక్రవాహనాలు దొంగ తనం జరుగుతుండటం, అలాగే 6-5-25న గొల్ల మధుశేఖర్, 26-9-2024న చంద్రశేఖర్ తమ ద్విచక్రవాహనాలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారని గోనెగండ్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు డీఎస్పీ భార్గవి ఆధ్వర్యంలో గోనెగండ్ల సీఐ విజయభాస్కర్ తన బృందంతో విచారణ చేపట్టాడు. వాహనాల దొంగ బెళగల్ మండలం పోలుకల్లు గ్రామానికి చెందిన ఉప్పరి వీరేశ్‌గా గుర్తించారు. దీంతో కొన్ని రోజులుగా పోలీసులు డేగకన్నువేసి అనుసరించారు. శనివారం పథకం ప్రకారం మాటు వేసి గాజులదిన్నె క్రాస్ రోడ్డు వద్ద రూ. 5లక్షల విలువ చేసే 4 ద్విచక్రవాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు. ద్విచక్రవాహనాల దొంగను పట్టుకుని వాహనాలను రికవరీ చేయడమే గాకుండా దొంగను పట్టుకోవడంలో చాకచక్యం చూపిన సీఐ విజయభాస్కర్, సిబ్బంది దేవరాజు, ఎన్‌టీ కుమార్, కార్తీక్, మద్దిలేటి, కృష్ణనాయక్, మహేంద్ర, డీఎస్పీ భార్గవి అభినందించారు.

జ్ఞాపకాలు..
చెల్లాచెదురు..!

- ఒకప్పుడు 65 ఏళ్లకు.. ఇప్పుడు 35 ఏళ్లకే
- కర్నూలు జీజీహెచ్‌కు పెరుగుతున్న బాధితులు
- నేడు వరల్డ్ అల్జీమర్స్ డే



కర్నూలు పెద్దాసుపత్రిలోని న్యూరాలజీ ఐసీయూ



కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అల్జీమర్స్ జ్ఞాపక శక్తిని నాశనం చేసే వ్యాధి. ఇది ఏ వయస్సు వారికైనా వస్తుంది. ఒకప్పుడు 65 ఏళ్లకు వచ్చే ఈ వ్యాధి ప్రస్తుతం 35 ఏళ్లలో కనిపిస్తుంది. వయస్సుతో పాటు ఎంతో కొంత మతిమరుపు రావడం సహజం. దానికి చింతించాల్సిన అవసరం లేదు. కాసిన్ని కొండ గుర్తులు పెట్టుకోవడం ద్వారా ఆ గండం దాటవచ్చు. వయసు పెరిగేకొద్ది వచ్చే అల్జీమర్స్ వ్యాధి సోకిన వారు తమ పేరు మర్చిపోతారు. ఒకేచోట కూర్చుని పనిచేసేవారు, టీవీలు చూస్తు ఉండటం, అతిగా మద్యం సేవించడం, శారీరక, మానసిక వ్యాయామం లేకపోవడం, అధిక కొవ్వు ఉన్న మాంసం తినడం వల్ల కూడా ఈ వ్యాధి సోకే అవకాశం ఉంది. ఈ వ్యాధి సోకిన వారు బంధువులు, కుటుంబ సభ్యుల పేర్లు మార్చిపోతారు. పేర్లు మర్చిపోవడంతో పాటు వారిని గుర్తించడం కూడా కష్టమే. వారు చేసే వృత్తి, వ్యాపారం కూడా గుర్తుండవు.. చివరకు తిన్నామా లేదా స్నానం చేశామా లేదా అనేవి కూడా ప్రశ్నలుగా మారుతాయి. మెదడులో ఉన్న కొన్ని కణాల పనితీరు తగ్గడమే అల్జీమర్స్‌కు దారి తీస్తుంది. అదే విధంగా తలకు బలమైన గాయాలు తగిలినప్పుడు, ఇన్‌ఫెక్షన్లు, బ్రెయిన్‌లో కణతులు ఏర్పడటం, బీ12 విటమిన్ లోపాలు, థైరాయిడ్, మెదడు పోటు బాధితులకు త్వరగా అల్జీమర్స్ వచ్చే అవకాశం ఉంటుంది. మలివయసులో జీవితాన్ని దుర్భరంగా మారే ఈ మహమతి మరుపు రాకుండానే మేల్కోవాలి. 1901లో ఈ వ్యాధిని గుర్తించారు. మన దేశంలో ప్రతి 27 మందిలో ఒకరు అల్జీమర్స్ బాధితులే. ఈ వ్యాధి గుర్తించి అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం సెప్టెంబరు 21న ప్రపంచ అల్జీమర్స్ డేగా జరుపుకుంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఇది పరిస్థితి..

అల్జీమర్స్ బాధితుల సంఖ్య క్రమంగా పెరుగుతుంది. ఎక్కువగా 65 ఏళ్ల నుంచి 75 ఏళ్లలో ఇది కనిపించేవి. ప్రస్తుతం 40 ఏళ్ల పైబడిన వారిలో ఇలాంటి లక్షణాలు కనిపిస్తున్నాయి. ప్రధానంగా అమలాయిడ్ ప్రికర్సర్ ప్రోటీన్ అనే జన్యుపరమైన ప్రోటీన్ డిఫెక్ట్ కారణంగా అల్జీమర్స్ సోకుతుంది. కర్నూలు జీజీహెచ్‌లోని న్యూరాలజీ విభాగంలో 20 పడకలు, స్ట్రోక్ యూనిట్ (ఐసీయు)కు 12 పడకలు ఉన్నాయి. ప్రతి సోమ, గురు వారాల్లో ఓపీ ఉంటుంది. ప్రతి ఓపీకి 150 నుంచి 160 మంది రోగులు వస్తుంటారు. ఇందులో ప్రతి నెల న్యూరాలజీ విభాగానికి దాదాపు 100 అల్జీమర్స్ కేసులు వస్తుంటాయి. పది శాతం కేసులు మతిమరుపు లక్షణాలతో వస్తూంటాయి.

ఈ జాగ్రత్తలు అవసరం

- ప్రతి రోజూ వ్యాయామం చేయాలి.
- శ్వాసను నెమ్మదిగా పీల్చుకుంటే ఏకాగ్రత పెరుగుతుంది.
- నిద్ర అనేది చాలా ముఖ్యమైంది. ప్రతిరోజూ 8గంటలు నిద్రపోవాలి.
- ప్రతి పనికి కంగారు పడకుండా ఉండాలి.
- ప్రతిరోజూ ఇష్టమైన పుస్తకాలు చదవాలి.
- విటమిన్ బీ12 లోపం లేకుండా చూసుకోవాలి. నాన్‌వెజ్, ఆకుకూరలు, కూరగాయలు తినాలి.
- ప్రతి పనికి కంగారు పడకుండా ఉండాలి
- మధుమేహాన్ని, బీపీని అదుపులో ఉంచుకోవాలి
- చెస్, స్క్రాబిన్ వంటి ఆటలు ఆడాలి.
- సంగీతం వినడం, పాటలు పాడటం ద్వారా ఒత్తిడిని తగ్గించుకోవచ్చు.

డిమోన్షియా క్లీనిక్‌లు అవసరం



అల్జీమర్స్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో డిమోన్షియా క్లీనిక్‌లు ఎంతో ఉపయోగపడుతాయి. త్వరలో వీటిని న్యూరాలజీ విభాగంలో ఏర్పాటు చేస్తున్నాం. 65 ఏళ్లలో 5శాతం అల్జీమర్స్ లక్షణాలు ఉండగా.. 70 ఏళ్లలో 10 శాతం, 85 ఏళ్లలో 40 శాతంకు పెరుగుతుంది. వ్యాయామం లేకపోవడం, అందరితో కలిసి మాట్లాడకపోవడం ప్రతి పనికి ఒత్తిడికి గురి కావడం, చిన్న చిన్న విషయాలను మరిచిపోవడం లక్షణాలు ఉంటే ప్రారంభదశలో గుర్తించి చికిత్స తీసుకోవాలి. **- డాక్టర్ సి.శ్రీనివాసులు, న్యూరాలజీ హెచ్‌వోడీ, కర్నూలు జీజీహెచ్**

40 ఏళ్లు దాటిన వారిలో...



ఇటీవల కాలంలో అల్జీమర్స్ వ్యాధి 40 ఏళ్లు దాటిన వారిలో కనబడుతుంది. మారిన జీవనశైలి, నిద్రలేమి ఒత్తిడి, మధుమేహం, ఊబకాయం, బీపీ జన్యు సమస్యల వల్ల అల్జీమర్స్ వచ్చే అవకాశం ఉంది. మంచి నిద్ర, ఒత్తిడి నియంత్రణలో పెట్టుకోవాలి. సమతుల్య ఆహారం తీసుకోవడం, నీరు ఎక్కువగా త్రాగడం, ఆల్కహాల్, స్మోకింగ్‌లకు దూరంగా ఉండాలి. **- డాక్టర్ నాగ సురేష్, కన్సల్టెంట్ న్యూరో ఫిజీషియన్, మెడికవర్ హాస్పిటల్**

నిద్రతో జ్ఞాపకశక్తి పెరుగుతుంది



8 గంటలు తప్పనిసరిగా నిద్రపోవాలి. మంచి నిద్రతోనే జ్ఞాపకశక్తి పెరుగుతుంది. విటమిన్ బీ-12 లోపం వల్ల కూడా అల్జీమర్స్ వచ్చే ప్రమాదం ఉంది. ఆహారంలో యాంటి ఆక్సిడెంట్లు, ఒమేగా త్రిప్యాటీ యాసిడ్‌లు తీసుకోవాలి. అల్జీమర్స్‌ను త్వరగా గుర్తించాలి. అల్జీమర్స్‌ను త్వరగా గుర్తించాలి. ఏదైనా విషయం గుర్తుండాలంటే 8 సెకన్లు ఆలోచించాలి. దానీ మీద ఏకాగ్రత పెట్టాలి. **- డాక్టర్ చల్లపల్లె బాబురావు, కన్సల్టెంట్, న్యూరో ఫిజీషియన్, కిమ్స్ హాస్పిటల్**

ఉల్లి రైతులను ఆదుకునేందుకు సీఎం కృషి

- మంత్రి టీజీ భరత్



కర్నూలు అర్బన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కష్టాల్లో ఉన్న ఉల్లి రైతులను ఆదుకునేందుకు సీఎం చంద్రబాబు అన్ని విధాలా కృషి చేస్తున్నారని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. శనివారం నగరంలోని తన కార్యాలయంలో ఒక ప్రకటన ద్వారా హర్షం వ్యక్తం చేశారు. ఉల్లి పండించిన ప్రతి రైతుకూ హెక్టారుకు రూ.50 వేలు సహాయం అందించేందుకు సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకోవడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. హెక్టారుకు రూ. 50 వేలు ఆర్థిక సాయం చేయాలన్న నిర్ణయంతో ప్రభుత్వంపై వంద కోట్ల పైగా భారం పడినప్పటికీ సీఎం చంద్రబాబు ముందుకు వచ్చారని కొనియాడారు. ఈ సహాయం ద్వారా 24,218 మంది రైతులకు లబ్ధి చేకూరుతుంద న్నారు. అయినా ఓర్వలేని వైసీపీ నాయకులు ప్రభుత్వంపై బురదచల్లుతున్నారని ధ్వజమెత్తారు. వైసీపీ పాలనలో ఉల్లి ధరలు పతనమైనప్పటికీ పట్టించుకోలేదన్నారు. అదే కూటమి ప్రభుత్వం ఉల్లి ధరలు పడిపోతే ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచిందన్నారు. ఏడాదికి రూ.20 వేలు పెట్టుబడి సాయంలో భాగంగా మొదటి విడతగా రూ.7 వేలు జమచేశామన్నారు. ఉల్లి రైతులకు అండగా నిలబడేందుకు కిలో రూ.12 చొప్పున ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందన్నారు.

ఉల్లి రైతుల కన్నీళ్లు తుడిచిన చంద్రబాబు : సోమిశెట్టి

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉల్లి రైతుల కన్నీళ్లు తుడిచిన మహనీయుడని కుడా ఛైర్మన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుందన్నారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో ఉల్లి ధరలు ఒక్కసారిగా కిలో రూ. 2 నుంచి 4కు పడిపోయి రైతులు రోడ్డెక్కిన సందర్భాలు అనేకం ఉన్నాయన్నారు. క్వింటా ఉల్లి రూ. 517కు పడిపోయిందన్నారు. ఎన్నికల సమయంలో రూ. 3 వేలకోట్లతో ధరల స్థిరీకరణ చేస్తామన్న జగన్ మాటతప్పి, మడమ తిప్పారని గుర్తు చేశారు. అదే కూటమి ప్రభుత్వం ఉల్లి రైతుకు అండగా నిలుస్తుంటే ఫేక్ ఆత్మహత్యలకు ప్రేరేపిస్తున్నారని ధ్వజమెత్తారు.

ఉల్లి రైతుకు సాయంపై ఎంపీ బస్తిపాటి హర్షం

ఉల్లిరైతులకు నగదు సహాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించడంపై ఎంపీ బస్తిపాటి నాగరాజు శనివారం నగరంలోని తన కార్యాలయంలో ఒక ప్రకటన ద్వారా హర్షం వ్యక్తం చేశారు. ధరలు లేక నష్టపోతున్న ఉల్లి రైతులకు నగదు సాయం గొప్ప ఊరట ఇచ్చే అంశమన్నారు. ఉల్లి రైతులను ఆదుకుంటున్న సీఎం చంద్రబాబుకి కృతజ్ఞతలు తెలిపారు. ఉల్లి రైతులకు అండగా ఉండేందుకు కిలో రూ. 12కి ప్రభుత్వమే కొనుగోలు చేస్తుండటంతో పాటు రూ. 10 కోట్లకు పైగా ప్రభుత్వంపై భారం పడుతున్నప్పటికి ప్రతి రైతుకూ హెక్టారుకు రూ.50 వేలు సాయం అందించడం సాహసోపేతమైన నిర్ణయమని కొనియాడారు.

జగన్‌రెడ్డి పాలనలో నిర్లక్ష్యం : తిక్కారెడ్డి

వైసీపీ పాలనలో రైతుల పట్ల నిర్లక్ష్యం వహించారని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. శనివారం ఆ పార్టీ కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. ఉల్లి రైతులకు సాయం అందించాలని సీఎం చంద్రబాబు నిర్ణయించడంపై ధన్యావాదాలు తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 405278 ఎకరాలపైగా సాగు చేశారని, 24,218 కుటుంబాలకు ప్రత్యక్ష్యంగా ఉపయోగపడుతోంది. గత వైసీపీ పాలనతో ఎంత మంది ఆత్మహత్యలు చేసుకున్నా ఆదుకున్న పాపాన పోలేదన్నారు. రైతులకు వెన్నుపోటు పొడిచి నేడు ప్రేమ ఉన్నట్లు ముసలి కన్నీరు కార్చడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. పత్తికొండలో జ్యూస్ ఫ్యాక్టరీ త్వరలో ప్రారంభించి యుద్ధప్రాతిపదికన పూర్తి చేసే దిశగా చర్యలు చేపట్టామని ఆయన తెలిపారు.

ఉల్లి రైతులకు అండగా ప్రభుత్వం
- పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి



కల్లూరు: ఉల్లిపంట పండించిన ప్రతిరైతుకు హెక్టారుకు రూ.50వేలు ఆర్థికసాయం అందించి కూటమి ప్రభుత్వం అండగా నిలిచిందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. తీవ్రభావంతో పాటు ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు దెబ్బతిని మద్దతుధర లబించకపోయినా సీఎం చంద్రబాబు క్వింటాకు రూ.1200 మద్దతుధర కల్పించి కొనుగోలు చేస్తున్నారన్నారు. ఖరీఫ్ సీజన్‌లో 45,278 ఎకరాల్లో ఉల్లిపంట సాగు చేశారని ఆర్థికసాయం ద్వారా 24,218 మంది రైతులకు లబ్ధి చేకూరుతోందన్నారు.

ఉల్లి రైతులకు అండగా సీఎం



మాట్లాడుతున్న కోడుమూరు ఎమ్మెల్యే

కర్నూలు రూరల్: సీఎం చంద్రబాబు ఉల్లి రైతులకు అండగా నిలిచారని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పేర్కొన్నారు. శనివారం కర్నూలు మండలం పసుపుల గ్రామంలోనిమ స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఉల్లి సాగుచేసిన ప్రతి రైతుకు హెక్టారుకు రూ.50వేలు చొప్పున ఆర్థిక సాయం చేసేందుకు సీఎం నిర్ణయం తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రూ.వంద కోట్ల భారం పడినా ప్రభుత్వం వెనకడుగు వేయలేదన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రైతులు పట్టించుకోలేదని ఇప్పుడు కూటమిపై ఆ పార్టీ నాయకులు ఉల్లిరైతులను రెచ్చగొట్టి రోడ్డెక్కిస్తున్నారని ఎమ్మెల్యే ఆరోపించారు. మండల టీడీపీ కన్వీనర్ బుర్రా వెంకటేశ్ నాయుడు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు రామాంజనేయులు, పద్మ పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం

- వైసీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి విమర్శించారు. శనివారం ఎస్వీ కాంప్లెక్స్‌లోని కార్యాల యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి రైతులపై కుట్రలు చేస్తున్నారన్నారు. హెక్టార్‌కు రూ.50వేలు ఇస్తున్నామని, విపత్తు ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని రైతులను మోసం చేస్తున్నారన్నారు. ఉల్లిపంటను కొనకుండా ప్రభుత్వం ఎకరానికి రూ.20 వేలు ఇస్తామని చెబుతోందన్నారు. ఎకరానికి 1.50 లక్షల ఖర్చు వస్తే హెక్టార్‌కు రూ.50 వేలు ఇస్తే నష్టమే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.50 వేలు, రూ.1200 గిట్టుబాటు ధర ఏ మాత్రం సరిపోదన్నారు. కూటమి ప్రభుత్వం తక్షణమే ఉల్లికి గిట్టుబాటు ధర కల్పించి నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే మెడికల్ కళాశాల పేరుతో ప్రభుత్వం దోపిడీకి పాల్పడుతోందన్నారు.

మట్కారాయుళ్ల అరెస్టు

- రూ.38,430 నగదు.. మూడు సెల్ ఫోన్లు స్వాధీనం

మంత్రాలయం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలం రచ్చమర్రికి చెందిన ముగ్గురు మట్కా రాస్తుండగా శనివారం అరెస్టు చేసి వారి నుంచి రూ.38.430 నగదు, 3 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు మాధవరం ఎస్ఐ విజయకుమార్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

శ్రీశైల మల్లన్నను దర్శించుకున్న ప్రభుత్వ విప్



చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఈవో

శ్రీశైలం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహా పుణ్యక్షేత్రాన్ని శనివారం ఏపీ ప్రభుత్వ విప్ పి.జి.వి.ఆర్ నాయుడు (గంగబాబు) శనివారం దర్శించుకున్నారు. అధికారులు, అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈవో ఎం.శ్రీనివాసరావు శేషవస్త్రాలతో సత్కరించి ప్రసాదం, స్వామి, అమ్మవార్ల చిత్రపటాలను అందించారు.

6 వేల మొక్కలతో గ్రీన్‌సిటీ

● మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పి.విశ్వనాథ్



మొక్కలు పంపిణీ చేస్తున్న కమిషనర్ విశ్వనాథ్

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఒకే రోజు ఆరువేల మొక్కలు నాటి నగరాన్ని గ్రీన్ సిటీగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక రూపొందించినట్లు వేసినట్లు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. ఈమేరకు శనివారం పెద్దపాడు రహదారి పక్కన, డివైడర్ల మధ్యలో అధికారులతో కలిసి మొక్కలు నాటారు. మూడు నెలల నుంచి 12 వేల మొక్కలు నాటామని, ఈ ఏడాది 30 వేల మొక్కలు నాటాలని లక్ష్యమని, ఇప్పటికే 18 వేల మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, డీసీ సతీష్‌కుమార్‌రెడ్డి, హర్టికల్చర్ ఏడీ విజయలక్ష్మి, హెల్త్ ఆఫీసర్ డా.కే.విశ్వేశ్వరరెడ్డి, ఇంచార్జి ఎస్ఈ శేష సాయి, ఎంఈ మనోహర్‌రెడ్డి, డీఈఈ గిరిరాజ్, క్రిష్ణలత, ఏఈ జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి జయంతిని కర్నూలులో నిర్వహించాలి



మాట్లాడుతున్న మహేష్ నాయుడు

కర్నూలు కలెక్టరేట్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగే వాల్మీకి జయంతిని కర్నూలులో నిర్వహించాలని వాల్మీకి సంఘం నేతలు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం జిల్లా పరిషత్ కార్యాలయంలోని వాల్మీకి కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి సంఘం నేతలు మాట్లాడుతూ రానున్న వాల్మీకి జయంతిని జిల్లాలో అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. అదే విదంగా గౌరిగోపాల్ నందు నెలకొల్పిన వాల్మీకి విగ్రహాన్ని తొలగిస్తే జిల్లా వాల్మీకుల ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుందని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ మహేష్ నాయుడు, ఏపీ అర్బన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్లు మురళి నాయుడు, రామకృష్ణ కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి డెవలప్మెంట్ కమిటి సభ్యులు రామాంజనేయులు, జిల్లా వాల్మీకి జాయింట్ యాక్షన్ కమిటి కన్వీనర్ కృష్ణ, కుబేరస్వామి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

గురజాడ సేవలు వెలకట్టలేనివి



నివాళి అర్పిస్తున్న ప్రిన్సిపాల్ ఇందిరా శాంతి

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): గురజాడ అప్పారావు సాహిత్య సేవ వెలకట్టలేనిదని ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ఇందిరాశాంతి అన్నారు. శనివారంలో కళాశాలలో జయంతి సందర్భంగా గురజాడ చిత్రపటానికి నివాళి అర్పించారు. కవి, రచయిత, సాహిత్య విమర్శకులు జంధ్యాల రఘుబాబు గురజాడ రచనలను విద్యార్థులకు పరిచయం చేశారు. పూర్ణమ్మ, కన్యక, కన్యాశుల్కమ్ రచనల ద్వారా స్త్రీ అభ్యుదయాన్ని కాంక్షించారన్నారు. వాడుక భాషలో రచనలు చేసి సాహిత్యాన్ని ప్రజల వద్దకు చేర్చిన మహనీయుడు గురజాడ అన్నారు. వైస్ ప్రిన్సిపల్ ఎ. సత్యనారాయణ, తెలుగు అధ్యాపకురాలు వింధ్యావాసిని దేవి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఫక్రున్నీసా బేగం, .ఇ.శ్రీనివాస్, హేమలత, విదార్థులు పాల్గొన్నారు.

'మెడికవర్'లో వారోత్సవాలు



సిబ్బందితో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డా.విశ్వేశ్వరరెడ్డి

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నగరలోఓని మెడికవర్ హాస్పిటల్‌లో అంతర్జాతీయ హౌస్ కీపింగ్ వారోత్సవాలు నిర్వహించారు. శనివారం మున్సిపల్ కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ డా.విశ్వేశ్వరరెడ్డి హౌస్ కీపింగ్ సిబ్బందిని సన్మానించారు. కోవిడ్ సయమంలోని ప్రాణాలకు తెగించి పనిచేశారని మెడికవర్ క్లస్టర్ హెడ్ వై.మహేశ్వరరెడ్డి అన్నారు. అనంతరం హౌస్ కీపింగ్‌లకు న్యూరోసర్జన్ డా.విశ్వకుమార్, ఆపరేషన్ హెడ్ ఇమ్రాన్, రీజినల్ హెడ్ ప్రవీణ్ కుమార్ సన్మానం చేశారు.

ప్రభుత్వ పాఠశాలలో మెడికల్ క్యాంప్



పరీక్షలు నిర్వహిస్తున్న డా.వాసురెడ్డి డా.వినీషారెడ్డి

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బాలజీ నగర్ ప్రభుత్వ పాఠశాలలో బీజేపీ ఆధ్వర్యంలో వీఆర్ మల్టిస్పెషాలిటీ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా.వినీషారెడ్డి మాట్లాడుతూ మోదీ జన్మదినం మెడికల్ క్యాంప్‌ను నిర్వహించామన్నారు. హాస్పిటల్ అధినేత డా.సి.వాసురెడ్డి జనరల్ ఫిజీషియన్ డా.వినీషారెడ్డి 300 మంది విద్యార్థులను పరీక్షించి, మందులను పంపిణీ చేశారు. గీతామాధురి రెడ్డి బార్గవ్‌రామ్, రామాంజనేయులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు శక్తి యాప్

● నగరంలోని కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించిన పోలీసులు



బి.క్యాంపు బాలికల ఉన్నత పాఠశాలలో శక్తీ టీమ్ సభ్యురాలు

కర్నూలు క్రైం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తమ భద్రతకు మహిళలు శక్తి యాప్ వాట్సాప్ సేవలను వినియోగించుకోవాలని మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఉపేంద్ర బాబు సూచించారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు డీఎస్పీ ఆధ్వర్యంలో శక్తిటీం బృందాలు నగరంలోని పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పోక్సో చట్టాలు, ఈవ్ టీజింగ్‌ను వివరించారు. అత్యవసర సమయాల్లో నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు శక్తి వాట్సాప్ 7993485111ను ఫోన్‌లో సేవ్ చేసుకోవాలన్నారు. అలాగే 112, 1091, 1098, 181, 1930 నంబర్లకు డయల్ చేయొచ్చని మహిళల భద్రతకు పోలీసులు కృషి చేస్తారన్నారు. గంజాయి, డ్రగ్స్ మాదక ద్రవ్యాల విక్రయం, వినియోగం సమాచారాన్ని ఈగల్ టీం టోల్ ఫ్రీ నెంబర్ 1972కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ ఏడాది 16,722 మంది మహిళలు శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారని తెలిపారు.

'స్వచ్ఛతాహిసేవా'లో భాగస్వాములవ్వాలి



స్వచ్చత కార్యక్రమంలో ఉపకులపతి వెంకట బసవరావు, విద్యార్థులు

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'స్వచ్చతాహిసేవా'లో విద్యార్థులు భాగస్వామ్యం కావాలని ఆర్‌యూ వీసీ వి. వెంకట బసవరావు సూచించారు. శనివారం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో యూనివర్సిటీలో శుభ్రం చేశారు. రిజిస్ట్రార్ బోయ విజయకుమార్, ప్రిన్సిపల్ సీవీ కృష్ణారెడ్డి, డీన్‌లు సీ. విశ్వనాథరెడ్డి, ఆర్. భరత్ కుమార్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పి. నాగరాజు, విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

● ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో...

కళాశాల ప్రాంగణం శుభ్రతగా ఉంచడం విద్యార్థుల బాధ్యత అని ప్రిన్సిపల్ ఇందిరా శాంతి అన్నారు. శనివారం ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో 46 మొక్కలను నాటారు. వైస్ ప్రిన్సిపల్ హేమంత్ , ఆధ్యాపకులు సత్యనారాయణ, ఆధ్యాపకురాలు వింధ్యావాసిని దేవీ, ఎన్ఎస్ఎస్ అధికారులు సోమశేఖర్, రోషన్న, వెంకట స్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ షూటింగ్ బాల్ క్రీడలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కేవీ సుబ్బారెడ్డి

కర్నూలు స్పోర్ట్స్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అవుట్‌డోర్ స్టేడియంలో జాతీయ షూటింగ్ బాల్ క్రీడలు శనివారం నిర్వహించారు. కేవీ సుబ్బారెడ్డి విద్యాసంస్థల అధినేత డా.కేవీ సుబ్బారెడ్డి పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులను ప్రోత్సహించడానికి తాను ముందుంటానని, చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమన్నారు. క్రీడా ప్రతినిధి పరుశురాముడు, రామాంజనేయులు, రాఘవేంద్ర, ఉపాధ్యాయులు సుభాన్ బాషా, ప్రభాకర్, కిరణ్ కుమార్, కోచ్, మేనేజర్లు పాల్గొన్నారు.

వాల్మీకుల సంక్షేమానికి టీజీవీ కుటుంబం కృషి

కర్నూలు అర్బన్ సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): టీజీవీ కుటుంబం వాల్మీకుల సంక్షేమానికి కృషి చేస్తుందని కార్పొరేషన్ డైరెక్టర్ సంజీవ లక్ష్మి అన్నారు. శనివారం నగరంలోని మంత్రి కార్యాలయంలో మాజీ కార్పొరేటర్ రామాంజనేయులు, నాయకులు నంది మధు, దశరథ రామనాయుడు తదితరులతో కలిసి విలేకల సమావేశం నిర్వహించారు. అక్టోబరు 7న వాల్మీకి జయంతిని మంత్రి టీజీ భరత్ సహకారంతో నిర్వహిస్తామని తెలిపారు. వాల్మీకి విగ్రహాన్ని తొలగించేందుకు మేయర్ బీవై రామయ్య చేసిన ప్రయత్నం వెనుక రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్, మంత్రి టీజీ భరత్ ప్రమేయం ఉందన్న ఆరోపణలను ఖండించారు. ఎమ్మెల్యేగా నగరం అభివృద్ధితో పాటు,, రాష్ట్ర మంత్రిగా పరిశ్రమల ఏర్పాటుకు టీజీ భరత్ అలుపెరుగని కృషి చేస్తున్నారన్నారు. వాల్మీకి విగ్రహం ఏర్పాటు విషయమై రాజ్యసభ సభ మాజీ సభ్యులు టీజీ వెంకటేశ్‌తో గానీ, మంత్రి టీజీ భరత్‌తో గానీ చర్చించారా అని ప్రశ్నించారు. ఒకవేళ చర్చించి ఉంటే సహకారం అందిస్తారు తప్ప విగ్రహాల తొలగింపును ప్రోత్సహించరన్నారు.



మాట్లాడుతున్న సంజీవ లక్ష్మి

మహిళల కోసం వైద్యశిబిరం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న గౌరు జనార్ధన్ రెడ్డి

ఓర్వకల్లు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మహిళల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ పేరుతో మెగా వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నాయని టీడీపీ యువ నాయకుడు గౌరు జనార్దన్ రెడ్డి అన్నారు. శనివారం ఓర్వకల్లు సామాజిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ క్యాంపును ప్రారంభించారు. అంతకుముందు ప్రాథమిక పాఠశాలలో ట్రిపుల్ ఐటీ విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. డీసీహెచ్ఎస్ జహరుల్లా, ఇన్‌చార్జి మెడికల్ ఆఫీసర్ శ్రీకాంత్, వైద్యులు దాదాబాషా, క్రిష్ణాబాయి, కిషోర్ రెడ్డి, సుప్రియ, ఎంఈవో ఓంకార్ యాదవ్, ఇన్‌చార్జి ఎంపీడీవో రమణయ్య, సుధాకర్‌రావు, నాగేశ్వరరెడ్డి, మోహన్ రెడ్డి, లక్ష్మికాంతరెడ్డి పాల్గొన్నారు.

పేద బ్రాహ్మణుల అభివృద్ధికి పనిచేద్దాం

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పేద బ్రాహ్మణుల అభివృద్ధికి పనిచేద్దామని నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని సంకల్‌బాగ్ హరిహర క్షేత్రంలో సమావేశం నిర్వహించారు. బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా రుణం. ఉపాధికి చర్యలు తీసుకునేలా చర్చించాలని కోరారు. న్యూరోసర్జన్ డాక్టర్ డబ్బు సీతారాం, కేసీ కల్కూర, కరివేన డాక్టర్ వేణుగోపాల్, కేవీ సుబ్బారావు, ఎన్ రామరాజు,కొలుకుల చంద్రశేఖర్ పాల్గొన్నారు.



డైరెక్టర్‌ను సన్మానిస్తున్న బ్రాహ్మణులు

రేపటి నుంచి దసరా నవరాత్రులు

కోడుమూరు రూరల్, సెప్టెంబరు 20, (ఆంధ్రజ్యోతి): గోరంట్ల లక్ష్మీ మాధవస్వామి ఆలయంలో సోమవారం నుంచి దసరా నవరాత్రులు ప్రారంభం కానున్నట్లు ఈవో గుర్రెడ్డి తెలిపారు. శనివారం మాట్లాడుతూ మొదటిరోజు అమ్మవారు ఆదిలక్ష్మి, 23న ధాన్యలక్ష్మి, 24న ధైర్యలక్ష్మి, 25న గజలక్ష్మి, 26న సంతానలక్ష్మి, 27న విజయలక్ష్మి, 28న విద్యాలక్ష్మి, 29న ధనలక్ష్మి, 30న మహాలక్ష్మి రూపంలో భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. అక్టోబరు 1న మహాపూర్ణాహుతి, 2న విజయదశమితో వేడుకలు ముగుస్తాయని వివరించారు.

పర్యావరణాన్ని రక్షిద్దాం

సి.బెళగల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని రంక్షించాలని మండల ప్రత్యేకాధికారి రమణ కోరారు. శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మొక్కలను నాటారు. అనంతరం సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ 18 గ్రామ పంచాయతీల కార్యదర్శులు ప్రతి ఇంటిని దర్శించి వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలని సూచించారు. సుపరింటెండెంట్ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు శ్యామల, సునీల్‌రాణి, అభిషేక్, సర్పంచ్‌లు ఉన్నారు.

డాక్టరేట్ ప్రదానం

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పుల్లయ్య ఇంజనీరింగ్ కాలేజీ ఎన్‌సీసీ ఆఫీసర్ ఎం. మధు శేఖర్ వైవీయూ డాక్టరేట్ ప్రదానం చేసింది. ప్రొఫెసర్ జి. సాంబశివారెడ్డి పర్యవేక్షణలో 'గ్రోత్ ఆఫ్ ప్రెస్ అండ్ నేషనలిజం ఇన్ కలోనియల్ కర్నూలు జిల్లా డ్యూరింగ్ ఏడీ 1858- 1947 ఏస్టడీ' అంశంపై పరిశోధన చేసి, యూనివర్సిటీకి సమర్పించగా ఉపకులపతి, ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు మార్గదర్శకత్వంలో నియమితులైన నిపుణుల బృందం పరిశీలించి ఆమోదించారన్నారు. వైవీయూ పరీక్షల విభాగం నిర్వహణ అధికారి కృష్ణారావు డాక్టరేట్ జారీ చేశారని తన పరిశోధక పత్రాలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్ లో ప్రచురితమయ్యాయని తెలిపారు.



ఎం.మధు శేఖర్

రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని రిపబ్లికన్ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి మహేష్ డిమాండ్ చేశారు. శనివారం మాట్లాడతూ ఉన్నత విద్యాశాఖ విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు ఉన్నత విద్యను కోల్పోతున్నారని, కళాశాలల యాజమాన్యాలు ఫీజు కట్టి సర్టిఫికెట్ తీసుకోవాలని ఒత్తిడి చేస్తున్నారని పెండింగ్ ఉన్న రూ.6,400 కోట్లను వెంటనే విడుదల చేయాలన్నారు.

క్యాన్సర్ పై అవగాహన ఉండాలి

● కెఎంసీ ప్రిన్సిపాల్ కె.చిట్టినరసమ్మ



ప్రిన్సిపాల్‌కు పరీక్ష చేస్తున్న వైద్యురాలు

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మహిళలు క్యాన్సర్ పట్ల అవగాహన పెంచుకోవాలని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కె. చిట్టినరసమ్మ సూచించారు. శనివారం స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో 'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్'లో భాగంగా మహిళలకు క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రజల జీవనశైలి మారిందని, తీసుకునే ఆహారంలో హానికర కారకాలు ఉండటంతో క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉందన్నారు. ఆరోగ్యం విషయంలో చిన్న తేడా కనిపించినా వైద్యుడని సంప్రదించాలని కోరారు. అనంతరం వైద్యులు, నర్సింగ్, పారా మెడికల్ సిబ్బందికి క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డా.కృష్ణ ప్రకాష్, కెఎంసీ నోడల్ ఆఫీసర్ డా.మాధవీ శ్యామల, క్యాన్సర్ హాస్పిటల్ సీఎస్ఆర్ఎంవో డా.బి. హేమనళిని పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు



కార్యదర్శులకు సూచనలు ఇస్తున్న కమిషనర్

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటానని నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్ హెచ్చరించారు. శనివారం ఆయన సంకల్‌బాగ్ 123, 124 సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. 123వ సచివాలయంలో ధ్రువీకరణ పత్రాల జారీ జాప్యంపై కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. కార్యదర్శులకు బయటకు వెళితే తప్పక మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. ప్రజలు అడిగిన సమాచారాన్ని స్పష్టంగా వివరించాలని, ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే విచారణ చేసి, చర్యలు తీసుకుంటానన్నారు.

న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలి

● విద్యుత్ జేఏసీ డిమాండ్



రిలే నిరాహార దీక్షల్లో పాల్గొన్న ఉద్యోగులు

కల్లూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల న్యాయమైన కోర్కెలు పరిష్కరిం చాలని జేఏసీ చైర్మన్ సతీష్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం ఏపీ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో కర్నూలు సర్కిల్ ఆఫీసు వద్ద రెండోరోజు రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. ఈనెల 15 నుంచి దశలవారీగా పోరాటాలు చేస్తున్నామన్నారు. 22న కలెక్టరేట్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. శివకుమార్, బెళగల్ హుసేనీ, కె.పెద్దయ్య, ఎం.నాగశేషులు, భాస్కర్, సురేష్, దామ్లనాయక్, సీఎం.ప్రసాద్, నాగమల్లేశ్వరరావు, రామరాజు, కృష్ణయ్య, ఆనంద్ దేవపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమస్థాయిలో 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర'



మొక్కలు నాటుతున్న జేడీ వరలక్ష్మి

కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమ స్థాయిలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర సాధనకు కృషి చేస్తోందని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ వరలక్ష్మి అన్నారు. శనివారం కలెక్టరేట్ సమీపంలోని ఏడీఏ కార్యాలయ ప్రాంగణంలో మొక్కలను నాటారు. ప్రపంచవ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో కాలుష్యం విపరీతంగా పెరిగి, ప్రజలు అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. కాలుష్య నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పచ్చదనాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాయని, ప్రభుత్వ లక్ష్యాలు సాదించడంలో వ్యవసాయశాఖ పని చేస్తుందన్నారు. రైతులు మిశ్రమ పంటలు సాగుచేస్తే విత్తన భద్రతతో పాటు ఆర్థిక లాభాలు పొందుతారన్నారు. ఏడీఏ వర్ధన్ రెడ్డి, కల్లూరు ఏవో విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నామన్నారు. డీఆర్‌సీ ఏడీఏ వెంకటేశ్వర్లు, ఏవోలు రూపస్ రోనాల్డ్, రాఘవేంద్ర, అల్లిపీర, కిషోర్, ఏపీ ఎన్జీవో నగర అధ్యక్షులు కాశన్న, తదితరులు పాల్గొన్నారు.

ఉల్లి రైతుకు రూ.50వేలు

గూడూరు, సెప్టెంబరు 20 (ఆంధ్ర జ్యోతి): ఉల్లి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం హెక్టారుకు రూ.50వేలు ఇవ్వనుందని టీడీపీ మండల అధ్యక్షుడు జె.సురేష్ అన్నారు. శనివారం కె.నాగలాపురం గ్రామంలో రైతు సంక్షేమమే ధ్యేయంగా చంద్రబాబు పాలన సాగుతోందన్నారు. ప్రభుత్వంపై రూ.వందకోట్లకు పైగా భారం పడినా సీఎం చంద్రబాబు ముందుకు వెళ్తున్నారన్నారు. కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరికి రైతులు ధన్యవాదాలు తెలిపారు. గోపాల్ రెడ్డి, నాగ సుంకన్న, తిరుపాలు, యుగంధర్, వసంత కుమార్, సుంకన్న ఉన్నారు.



మాట్లాడుతున్న సురేష్

క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కోడుమూరు రూరల్, సెప్టెంబరు 20, (ఆంధ్ర జ్యోతి): వర్కూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థు లు క్రీడల్లో ప్రతిభ కనబరచినట్లు హెచ్‌ఎం పర్వీన్‌భాను, పీడీ రసూల్ బీ అన్నారు. శనివారం విద్యార్థులను అభినందించారు. ఇందిరాబాయి, లక్ష్మీనారాయణ, శివన్న, శ్రీనివాసులు, రాజశేఖర్, రమణమూర్తి పాల్గొన్నారు.

అవయవదానంపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా నూతన చైర్మన్ డా.కేజీ గోవిందరెడ్డి

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రెడ్‌క్రాస్ సొసైటీ సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లి అవయవదానం, రక్తదానం పట్ల అవగాహన కల్పించాలని చైర్మన్ డా.కేజీ గోవిందరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం రెడ్‌క్రాస్ సొసైటీ నూతన కమిటి సమావేశం బ్లడ్ బ్యాంకులో నిర్వహించారు. ప్రభుత్వ అధికారులు, స్వచ్ఛంద సంస్థలను అనుసంధానించుకుని ముందుకెళ్తామని తెలిపారు. యువతపై మాదక ద్రవ్యాలను వినియోగించకుంటే విస్తృత ప్రచారం చేయాలన్నారు. జిల్లా వైస్ చైర్‌పర్సన్ అరుణ మాట్లాభక్తులకు గత 28 సంవత్సరాలుగా రెడ్‌క్రాస్ తరుపున వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. కోశాధికారి నరసింహ, కమిటి సభ్యులుగా జి.శ్రీనివాస్ యాదవ్, డా.కేవీ సుబ్బారెడ్డి, బి.ప్రభాకర్ రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, భీమశంకర్ రెడ్డి, వెంకట కృష్ణుడు పాల్గొన్నారు.

ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు

ఉల్లి రైతుకు అండగా ప్రభుత్వం

ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

పత్తికొండ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ధర లేక తీవ్రంగా నష్టపోయిన ఉల్లిరైతులకు టీడీపీ ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. శనివారం ఆయన ఫోన్‌లో ఆంధ్రజ్యోతితో మాటా ్లడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఖరీఫ్‌సీజన్‌లో 24,218 మంది రైతులు 45,178 ఎకరాలలో ఉల్లిప ంటను సాగుచేశారన్నారు. అయితే మార్కెట్‌లలో ఉల్లికి డిమాండ్ లేకపోవడంతో పెట్టిన పెట్టుబడులు దక్కక రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నా రన్నారు. పరిస్థితిని తెలుసుకున్న ముఖ్యమంత్రి వారిని ఆదుకునేందుకు హెక్టారుకు రూ.50,000 ఆర్థికసాయం ప్రకటించారని తెలిపారు.

తుగ్గలి: ఉల్లి రైతులు ఇబ్బందులు పడుతున్నారనీ, వారిని ఆదుకోవడం కోసం సీఎం చంద్రబాబు నాయుడు హెక్టారుకు రూ.50వేలు ప్రకటించడం హర్షించదగ్గ విషయమని ప్రభుత్వ ట్రైబల్ వెల్ఫేర్ సలహా మండలి సభ్యులు వెంకటపతి, టీడీపీ మండల కన్వీనర్ తిరుపాల్ నాయుడు అన్నారు. శనివారం వారు వేర్వేరుగా విలేకరులతో మాట్లాడుతూ ఉల్లి రైతులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తించిన సీఎం చంద్రబాబు ఉల్లి రైతులకు హెక్టారుకు రూ.50వేలు ఆర్థిక సాయం అందించేందుకు నిర్ణయం తీసుకున్నారని తెలిపారు.

మార్కెట్ యార్డులో అభివృద్ధి పనులు

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ మార్కెట్ యార్డులో రూ. కోటి 30 లక్షలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని కడప మార్కెటింగ్ శాఖ ఈఈ సుబ్బారెడ్డి తెలిపారు. శనివారం ఆయన ఆదోని మార్కెట్ యార్డు లో జరుగుతున్న పనులను పరిశీలించారు. కాంట్రాక్టర్ త్వరగా పనులు పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట డీఈ రఘురాం రెడ్డి ఉన్నారు.

ప్రైవేట్ టీచర్లకు సెలవులు ఇవ్వాలి

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న టీచర్లకు ఇతర పనులు అప్పజెప్పకుండా దసరా సెలవులు ఇవ్వాలని పీటీఎల్ హెచ్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు నరేష్ ఆచారి డిమాండ్ చేశారు. సమావేశంలో పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు సోమశేఖర్, బీడీఎస్‌ఎఫ్ రాష్ట్ర నాయకుడు రమేష్, పీడీఎస్‌వో రాష్ట్ర నాయకుడు తిరుమలేష్, ఏఐఎస్‌ఎఫ్ నాయకుడు దస్తగిరి, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి నవీన్ పాల్గొన్నారు.

పచ్చదనం పెంపునకు కృషి చేయాలి

● కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి



పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న కలెక్టర్ సిరి

క్రిష్ణగిరి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పచ్చదనం పెంపునకు అందరు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్. ఏ. సిరి అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో బాగంగా క్రిష్ణగిరిలో నిర్వహించిన గ్రీన్ ఆంధ్ర ప్రదేశ్ అనే థీమ్ ర్యాలిలో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో పత్తికొండ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆలంకొండ నబి సాహెబ్‌తో కలసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. జిల్లాలో అటవీ విస్తీర్ణం 7శాతం మాత్రమే ఉందని ప్రతి ఒక్కరు ఒక మొక్కను బాధ్యతగా నాటి సంరక్షించాలని కోరారు. అలాగే ప్లాస్టిక్‌ను వంటింటి లోనే కాకుండ పరిసరాలలో కూడ నిషేదించాలని భావితరాలకు ప్లాస్టిక్ రహిత సమాజాన్ని అందించేందుకు అందుకు అందరు సహకరించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివించుకోవాలని సూచించారు. మండలంలో అంగన్ వాడీ కేంద్రాల ఏర్పాటు, పాఠశాల కాంపౌండ్ నిర్మాణం, కటారుకొండ గ్రామంలో బీసీ హస్టల్ ఏర్పాటు, దెబ్బ తిన్న రోడ్ల మరమ్మతులు చేసేందుకు కృషి చేస్తానని కలెక్టర్ హమీ ఇచ్చారు.

గ్రామ సచివాలయం తనిఖీ: క్రిష్ణగిరి గ్రామ సచివాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేసారు. అనంతరం అదికారులతో సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు అదికారులు కృషి చేయాలన్నారు. స్పెషల్ ఆఫీసర్ ఐసీడీఎస్ పీడీ విజయ, డీఆర్డీఏ పీడీ రమణారెడ్డి,జిల్లా పరిషత్ సీఈవో నాసర రెడ్డి, ఆర్డీవో భరత్ నాయక్, డీపీవో భాస్కర్, తహశీల్దార్ ప్రకాష్, సర్పంచ్ వరలక్ష్మీ, జెడ్పీటీసీ కేఈ సుభాషిణి, మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు కటారుకొండ మర్రి శ్రీరాములు, దామోదర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం



కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి మీనాక్షినాయుడు, నాయకులు,

ఆదోని, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆదోని పట్టణంలోని మండిగిరి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు, నాయకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి మీనాక్షినాయుడు కూటమి నేతలు, అధికారులు కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షనకు కట్టుబడి ఉన్నామన్న సంకేతాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు విట్టా రమేష్, దొడ్డనగేరి శివప్ప, అప్సర్‌బాష, బుద్ధారెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.

ఆదోని రూరల్: ప్రతి ఒక్కరు మొక్కలునాటి అలవర్చుకోవాలని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆరేకల్లు రామకృష్ణ తెలిపారు. స్వర్ణంధ్ర స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో భాగంగా, శనివారం గ్రామంలోని ఆసుపత్రి, పాఠశాలల వద్ద పలు రకాల మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎఎన్ నాగవేణి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉల్లి రైతులకు అండగా సీఎం

ఆలూరు రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గిట్టుబాటు ధర లేక నష్టాల్లో ఉన్న ఉల్లి పండించిన రైతులకు సీఎం చంద్రబాబునాయుడు అండగా నిలిచి భరోసా ఇవ్వడం హర్షనీయమని టీడీపీ రైతు కమిటీ రాష్ట్ర కార్యదర్శి నారాయణరెడ్డి అన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

దేవనకొండ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మనచుట్టు ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తహసీల్దార్ రామాంజినేయులు, ఎంపీడీవో జ్యోతి సుచించారు. స్వచ్ఛంధ్రా స్వర్ణంధ్రా కార్యాక్రమంలో భాగంగా స్ధానిక ఎంపీడీవో కార్యాలయం నుండి బస్టాండ్ వరకు పాఠశాల విద్యార్థులతో ర్యాలీ చేసి, బస్టాండ్ ఆవరణంలో మానవహారం నిర్వహించి, పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేశారు. పశువైద్యాశాల, ఎంపీడీవో కార్యాలయం ఆవరణాలలో మొక్కలు నాటారు. ఎంఈవో తిమ్మారెడ్డి, డీప్యూటీ ఎంపీడీవో గోపాల్, పశువైద్యాధికారి వెంకటేష్, వినిలా, ఏపీవో రాజునాయక్ పాల్గొన్నారు.

సోమవారం నుంచి నవరాత్రి ఉత్సవాలు

ఆదోని టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మునిసిపల్ మైదానంలో సోమవారం నుంచి నవరాత్రి ఉత్సవాలను ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించనున్నట్లు ఉత్సవ సమితి సభ్యులు శ్రీనివాసరెడ్డి, కునిగిరి నాగరాజు తెలపారు. విట్టా అశ్విన్, మరుతీరావు, బసవరాజు స్వామి, ఉపేంద్ర కుమార్, లక్ష్మికాంత్ ప్రసాద్, ఈరన్న పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి

● ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే విరుపాక్షి

ఆలూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆలూరు నియోజకవర్గంలో దీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోని సమస్యలను పరిష్కరించాలని ఆలూరు ఎమ్మెల్యే బి.విరుపాక్షి నూతనంగా బాధ్యతలు చేపట్టిన జిల్లా కలెక్టర్ సిరిని శనివారం కలిసి విన్నవించారు. ఇందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈయన వెంట దేవనకొండ జెడ్పీటీసీ రామకృష్ణ ఉన్నారు.

బన్నీ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి



దేవరగట్టులో మాట్లాడుతున్న ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

హొళగుంద, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : దేవరగట్టులో జరిగే బన్నీ ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ శనివారం అన్నారు. అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామ పెద్దలు నేరణికి తాండా, కొత్తపేట గ్రామాల ప్రతినిధులు, పోలీసు శాఖ, వైద్య , విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు. తహసీల్దార్ నిజాముద్దీన్, ఎంపీడీవో విజయలలిత, గ్రామీణ నీటి సరఫరా శాఖ డిప్యూటీ ఇంజనీర్ మల్లికార్జునయ్య, విద్యుత్ శాఖ, ఏఈ ఓబులమ్మ, వైద్య అధికారి డాక్టర్ న్యూటన్, డాక్టర్ బిందు మాధవి పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన బీటీ నాయుడు



చంద్రబాబును కలిసిన బి.టి.నాయుడు

ఆదోని, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ చైర్మన్‌గా ఇటీవల నియమితులైన ఎమ్మెల్సీ బి.టి.నాయుడు సీఎం చంద్రబాబునాయుడిని ఉండవల్లిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు ఈ అవకాశం కల్పించడంతో కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. నూతన పదవిలో బాధ్యతలు స్వీకరించిన తర్వాత తన ప్రాధాన్యత శాసనమండలి సభ్యుల గౌరవాన్ని కాపాడమేని, ఇందుకోసం సమర్థవంతమైన విధానాలను అనుసరిస్తూ కృషి చేస్తానని బి.టి.నాయుడు స్పష్టం చేశారు.

దేవాలయాల్లో శుభ్రత పాటించాలి



దేవాలయాన్ని శుభ్రం చేస్తున్న అధికారులు, నాయకులు

మద్దికెర, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ఎంతో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథ స్వామి దేవాలయాల్లో శుభ్రత పాటించాలని దేవాలయ ఈవో వీరయ్య, ఆలయ చైర్మన్ పారా రవికుమార్ అన్నారు. శనివారం రంగనాథ స్వామి దేవాలయంలో నాయకులు, అధికారులు పరిసరాలను శుభ్రం చేశారు. టీడీపీ నాయకులు నరసింహులు గౌడు, రంగస్వామి, నెట్టికంటయ్య, వెంకటగిరి, శ్రీనివాసులు, నాగప్ప, గోపాల్ పాల్గొన్నారు.

సెల్ టవర్ బ్యాటరీలు చోరీ

హొళగుంద, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చిన్నహ్యట గ్రామంలో రిలయన్స్ సంస్థ ఏర్పాటు చేసిన జియో నెట్‌వర్క్ సెల్ టవర్‌లోని బ్యాటరీలు చోరీకి గురైనట్లు జియో సెల్ టవర్ టెక్నికల్ అసిస్టెంట్ శివ, స్థానికులు శనివారం తెలిపారు. విలువైన విద్యుత్ వైర్లు కూడా దొంగలు దోచుకొని పోయినట్లు రైతులు వాపోయారు.

వేరుశనగ ధర మరింత పతనం

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో వేరుశనగ ధర మరింత పతనమైంది. శనివారం వేరుశనగ ధర క్వింటాలు గరిష్టంగా రూ.4,559 లకు దిగజారింది, వారంతో పోల్చితే క్వింటానికి రూ.2,300పైగా ధర తగ్గింది.

ప్రభుత్వం విఫలం

తుగ్గలి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది సాగు చేసిన పంటలు అధిక వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్నాయని, రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఐ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి జగన్నాథం, జిల్లా కార్యదర్శి పాపన్న అన్నారు.సీపీఐ నాయకులు రాజాసాహేబ్, ఉమాపతి, సూరన్న, చిరంజీవి, మద్దిలేటి తదితరులు ఉన్నారు.

అండగా ఉంటాం: కోట్ల సుజాతమ్మ

దేవనకొండ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మృతి చెందిన బంటుపల్లి గ్రామానికి చెందిన ఈపీ రామాంజినేయులు కుటుంబానికి అండగా ఉంటామని టీడీపీ నాయకురాలు అన్నారు. శనివారం మండలంలోని బంటుపల్లి గ్రామంలో అమె పర్యటించి రామాంజినేయులు కుటుంబసభ్యులను పరామర్శించి, ఓదార్చారు. బడిగింజల రంగన్న, వెంకటస్వామిగౌడ్, ఆకుల వీరేష్, నాగేశ్వరరావు, మస్తాన్ ఉన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోని, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కౌతాళం మండలంలోని కుంబలనూరు వంక వద్ద శనివారం ఆదోని ఎక్సైజ్ శాఖ సీఐ సైదుల్లా తమ సిబ్బందితో అక్రమ మద్యాన్ని తరలిస్తున్న వారిపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా కుంబలనూరు గ్రామానికి చెందిన మబ్బు నరసింహా అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఒక ద్విచక్రవాహనం, రెండు బాక్సుల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ సైదులు తెలిపారు. పరారైన మరో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మాకు అనుమానం ఉంది..!



ధర్నా చేస్తున్న వారితో మాట్లాడుతున్న పోలీసులు

ఆదోని రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : 'మాకు అనుమానంగా ఉంది. రోడ్డు ప్రమాదంలో మా పిల్లవాడు మాత్రమే ఏలా చనిపోయాడని మృతుడు మల్లికార్జున, తల్లిదండ్రులు బంధువులు ఆందోళనకు దిగారు. శుక్రవారం కౌతాళం మండలం బదినేహాళ్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ మారుతి(29) , తిమ్మప్ప(30) ఆస్పరికి టమోటోలు తీసుకురావడానికి ఆటోలో బయల్దేరుతూ, గ్రామానికి చెందిన మల్లికార్జునను కూడ తీసుకెళ్లారు. అయితే వీరు ప్రయాణీస్తున్న ఆటో ఆస్పరి మండలం శంకర బండ గ్రామం వద్ద ప్రమాదానికి గురైంది. అయితే ఈ ప్రమాదంలో మల్లికార్జున మృతి చెందాడు. మిగిలిన ఇద్దరు ఏలాంటి గాయాలు లేకుండా బయట పడ్డారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆదోని ఆసుపత్రికి తీసుకెళ్లారు.. ఆస్పరి సీఐ గంగాధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇదిలా ఉండగా, అంత పెద్ద ప్రమాదంలో తమ పిల్లవాడు మాత్రమే ఏలా చనిపోయాడని సంఘటన పై అనుమానం ఉందని మృతదేహంతో మృతుడి తల్లిదండ్రులు, బంధువులు శనివారం సాయంత్రం ఆసుపత్రి వద్ద భైఠాయించారు. విషయం తెలుసుకున్న ఆదోని పోలీసులు అక్కడికి చేరుకుని న్యాయం చేస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

మద్దికెర, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలని మండల టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు ఆనంద్ కుమార్, సింగిల్ విండో డైరెక్టర్ చిన్న పెద్దన్న, రమేష్ అన్నారు. శనివారం తహసీల్దార్ గుండాల్ నాయక్‌కు వినతి పత్రం అందించిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఎం.అగ్రహారం గ్రామంలో 1400 కుటుంబాలు ఉన్నాయన్నారు. దాదాపు 8వేల జనాభా నివసిస్తున్నారనీ తెలిపారు. ఎం.అగ్రహారం గ్రామంలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు దృష్టికి తీసుకెళ్లామన్నారు.

వెల్దుర్తిలో 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్'

వెల్దుర్తి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి):ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆర్డీవో సందీప్ కుమార్ అన్నారు. శనివారం వెల్దుర్తిలో ఎంపీడీఓ సుహాసినమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్' కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ నుంచి పాతబస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ చంద్రశేఖర్‌వర్మ, జడ్పీటీసీ సుంకన్న, సర్పంచి శైలజ, పంచాయతీ సెక్రటరీ లక్ష్మీనాథ్, ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసూన పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాను సక్రమంగా రూపొందించాలి

ఆదోని టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రానున్న పురపాలక ఎన్నికల కోసం ఓటర్ల లిస్టును ఈసారి ఎలాంటి లోటుపాట్లు లేకుండా సక్రమంగా రూపొందించాలని వైసీపీ కు చెందిన కౌన్సిలర్లు సందీప్ రెడ్డి , ఫయాజ్, నరసింహులు శనివారం మున్సిపల్ కమిషనర్ కృష్ణను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈసారి జరగబోయే ఎన్నికలలో ఎలాంటి పొరపాట్లుకు అవకావం లేకుండా ఓటర్ల లిస్టు రూపొందించాలని కోరారు. కార్యక్రమంలో రాజేశ్వర్ రెడ్డి, నాగరాజు, రామలింగేశ్వర యాదవ్ పాల్గొన్నారు.

జాతీయ పార్టీలలో ప్రాతినిథ్యం అభినందనీయం

ఆదోని టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో అధిక సంఖ్యలో ఉన్న సాలి సమాజ్‌కు చెందిన వారికి రెండు జాతీయ పార్టీలలో పదవులకు అవకాశం కల్పించడం ఎంతో అభినందనీయమని వరల్డ్ సాలి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సాకరే మారుతీరావు అన్నారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా రసాలే గోవిందరావును, తెలుగుదేశం పార్టీ పట్టణ కార్యదర్శిగా గోపాల్ కృష్ణను ఎంపిక చేయడంతో వరల్డ్ సాలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు.

పేదలకు వీహెచ్‌ఆర్ ట్రస్ట్ సాయం



ఆహార ధాన్యాల కిట్లను పంపిణీ చేస్తున్న ట్రస్టు నిర్వాహకులు

ఆస్పరి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జోహరాపురం గ్రామంలో వీహెచ్‌ఆర్ ట్రస్టు ద్వారా గ్రామానికి చెందిన 55 పేద కుటుంబాలకు వీహెచ్‌ఆర్ ట్రస్టు ద్వారా ఆహార ధాన్యాల కిట్లను పంపిణీ చేశారు. 10 కేజీల బియ్యం, కేజీన్నర కందిబేడలు, కేజీ గోధుమపిండి, లీటర్ మంచినూనె కిట్లను శనివారం పంపిణీ చేశారు. వీఆర్వో హరినాయక్, మహమ్మద్‌రఫిక్, నారాయణరెడ్డి, లకీ&నారాయణ, చంద్ర పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి

పత్తికొండ టౌన్/ఆస్పరి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతాంగం సాగు చేసిన పంటలన్నింటినీ మార్కెట్‌లో అమ్ముకునేందుకు ధరలు పతనం కావడంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారని, రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథంలు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్నగౌడ్, జిల్లా రాజాసాహెబ్, శ్రీనివాసరావు, నియోజకవర్గ అధ్యక్షులు ఉమాపతి, కారన్న, కారుమంచి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటు పడండి

తుగ్గలి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలని ఎంపీడీవో విశ్వమోహన్, టీడీపీ రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు మనోహర్ చౌదరి అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శ్రీహరి, సర్పంచ్ అన్వర్‌బాషా, ప్రధానోపాధ్యాయులు విష్ణుమూర్తి, నాయకులు మైరాముడు తదితరులు పాల్గొన్నారు.

మద్దికెర :ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటడంతో పాటు వాటిని సంరక్షించాలని సర్పంచ్ బండారు సుహాసిని,జిల్లా టీడీపీ కార్యదర్శి గూడూరు ధనుంజయుడు అన్నారు. శనివారం మండల పరిధిలోని మద్దికెర, పెరవలి, బురుజుల గ్రామాల్లో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర ర్యాలీ నిర్వహించారు. ఉపసర్పంచ్ కవిరెడ్డి కృష్ణ, మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్.లక్ష్మినారాయణ, ఏపీవో నర్సిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, తదితరులు ఉన్నారు.

చర్మకారుల సమస్యల పరిష్కారానికి పోరాటం

మంత్రాలయం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చర్మకారులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేస్తామని ఏపీ సీపీఎస్ జిల్లా కార్యదర్శి సుమాల ఆంధోని అన్నారు. శనివారం మంత్రాలయంలో చర్మకార వృత్తిదారులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో జయరాజు, వీరేష్, సురేష్, అంజి పాల్గొన్నారు.



ఉల్లి రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

- హెక్టారుకు రూ. 50 వేలు ఆర్థిక సాయం: ఎమ్మెల్యే బీవీ



ఎమ్మిగనూరు, సెప్టెంబర్ 20(ఆంధ్రజ్యోతి): ఉల్లి ధరలు పతనంతో ఇబ్బందులు పడుతున్న రైతులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తు.. హెక్టారుకు రూ. 50 వేలు ఆర్థిక సాయం అందించేందుకు నిర్ణయం తీసుకుందని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి శనివారం పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన ప్రతిహామీని నిలబెట్టుకుంటుందన్నారు. కర్నూలు జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 45,278ఎకరాల్లో 24,218 మంది రైతులు ఉల్లిని సాగుచేశారన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సాయంతో వీరంతా లబ్ధి పొందనున్నారన్నారు. ఇప్పటికే ఉల్లిరైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని మద్దతు ధర రూ. 1200 ప్రకటించిందన్నారు. ఎమ్మిగనూరు మార్కెట్‌లో కూడా ఉల్లి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి దాదాపు 800 మెట్రిక్ టన్నులు వ్యాపారుల ద్వారా కొనుగోలు చేశామన్నారు. అన్నదాతను అన్ని విధాలుగా ప్రభుత్వం అందుకుంటుందని అన్నారు.

గోనెగండ్ల: ప్రభుత్వం ఉల్లి రైతుల కష్టాలను గుర్తించి హెక్టార్‌కు రూ. 50వేలు ఉచితంగా బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయనున్నట్లు తహసీల్దార్ రాజేశ్వరి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ సోమవారం నుంచి కర్నూలులో ఉల్లి మార్కెట్ ఉండదని రైతులు తాము పండించిన పంటను ఎక్కడైౖ అమ్ముకోవచ్చునని తెలిపారు. ఇటీవల భారీ వర్షాల కారణంగా ఉల్లి రైతులను ఆదుకునేందుకు గాను ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. ఇక ఉల్లికి రూ. 1200 మద్దతు ధర ఉండదని పేర్కొన్నారు. ఉల్లి రైతులు పండిన పంటను ఆరబెట్టుకొని గ్రేడింగ్ చేసుకొని ఎక్కడైన ఎంత ధరకైన అమ్ముకోవచ్చునని తెలిపారు. ఇతర వివరాలకు తహసీల్దార్ కార్యాలయం, వ్యవసాయశాఖ కార్యాలయాలను సంప్రదించాలని తెలిపారు.

ఉల్లి రైతుకు ప్రభుత్వం ఊరట



ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉల్లి రైతులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. గత నెల రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు, అలాగే ధర కూడా పతనం కావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం స్పందించి హెక్టారుకు రూ.50వేల పరిహారం కింద రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు చర్యలు చేపట్టింది. దీంతో ప్రభుత్వ నిర్ణయంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మిగనూరు మండలంతో పాటు నందవరం, గోనెగండ్ల మండలాల్లో రైతులు ఉల్లి పంటను సాగుచేశారు. ఎమ్మిగనూరు మండలంలో 1700 ఎకరాలు, నందవరం మండలంలో 345 ఎకరాలు, గోనెగండ్ల మండలంలో 2500 ఎకరాల్లో రైతులు ఉల్లి పంటను సాగుచేసి ఈక్రాప్‌ను చేయించుకున్నారు. అయితే చాలా మంది రైతులు ఉల్లిపంటకు ఈక్రాప్ చేయించుకోలేదు. ఈక్రాప్ చేయించుకోని రైతులు ఉల్లిపంటను విక్రయిస్తే వారికి క్వింటానికి రూ.1200 మద్దతు ధరను ప్రకటించి వారికి న్యాయం చేస్తామని ప్రకటించింది.

ప్రభుత్వం ఆదుకుంది..



తాను రెండు ఎకరాల్లో ఉల్లిపంటను సాగు చేశారు. ఉల్లిపంట చేతికొచ్చే సమయానికి ధర పూర్తిగా పతనమైంది. ఉల్లిపంటకు భారీగా పెట్టుబడి పెట్టాను. ధర లేక నష్టపోతానకున్న సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడు స్పందించి ఉల్లిపంటకు క్వింటానికి రూ1200 మద్దతు ధర కల్పించారు. కర్నూలు మార్కెట్ యార్డులో క్వింటం రూ.1200చొప్పున విక్రయించి నష్టాల నుంచి బయటపడ్డాను.

- శ్రీరాములు, ఉల్లి రైతు, కె.తిమ్మాపురం

ప్రభుత్వం నిర్ణయంతో ఎంతో మేలు



ఈ ఏడాది నాలుగు ఎకరాల్లో ఉల్లిపంటను సాగుచేశాను. ఉల్లి ధర పూర్తిగా పడిపోవడంతో ఇక అప్పులే శరణ్యమనుకున్నాను. ఇంతలోపు సీఎం చంద్రబాబునాయుడు ఉల్లి రైతుల బాధలను తీర్చేందుకు క్వింటానికి రూ.1200 మద్దతు ధర కల్పించడంతో పాటు, ఒక హెక్టారుకు రూ.50వేలు ప్రకటించడం ఎంతో ఆనందంగా ఉంది. ప్రభుత్వం రైతులు నష్టపోకుండా తీసుకున్న నిర్ణయం రైతులందరికీ ఎంతో మేలు జరుగుతుంది.

- బీటి మద్దిలేటి, ఉల్లి రైతు, కె.తిమ్మాపురం గ్రామం

కార్మికులకు రూ.26వేల వేతనం ఇవ్వాలి

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పెట్రోలు బంకుల్లో పనిచేస్తున్న కార్మికులకు రూ.26వేల వేతనం ఇవ్వాలని ఏఐటీయూసీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు వీరేష్, నరసింహారెడ్డి, విజయేంద్రలు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో వారు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా పెట్రోలు బంకుల్లో పనిచేస్తు కార్మికులకు కనీసం వేతనం, భద్రత, ఈఎస్ఐ కూడా కల్పించడం లేదన్నారు. వెంటనే కార్మికులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు.

ఉచిత వైద్య శిబిరం

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జన్మదిన సందర్భంగా బీజేపీ నాయకులు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక ముగతి పేట 3వ వార్డులో శ్రీవాణి విద్యాలయంలో గనప వీరేష్ అధ్వర్యంలో కర్నూలు కిమ్స్ హస్పిటల్ యాజమాన్యం సహకారంతో డాక్టర్ గనప మహేష్ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 174 మందికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కో కన్వీనర్ తోగట నరసింహులు, పట్టణ అధ్యక్షుడు జెట్టప్ప, మండల అధ్యక్షుడు వెంకటేష్, చిన్న ఈరన్న పాల్గొన్నారు.

పెద్ద కొత్తిలిలో పశువైద్య శిబిరం

నందవరం: పెద్దకొత్తిలి గ్రామంలో శనివారం పశువైద్యశిబిరం జరిగింది. పశువైద్యాధికారి నరేంద్రనాథ్‌రెడ్డి గేదలు, ఎద్దులకు, మేకలకు టీకాలు వేశారు. పశువులను పరీక్షించి మందులు అందజేశారు.

రక్తదానం గొప్పది : సీఐ


రక్తం ఇస్తున్న ఆస్పరి సీఐ గంగాధర్

గోనెగండ్ల, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): అన్ని దానాలలో కంటే రక్త దానం ఎంతో గొప్పదని ఇది ప్రాణదానంతో సమానం అన్ని ఆస్పరి సీఐ గంగాధర్, టీడీపీ నాయకుడు, అంబేడ్కర్ భవన సాధన కమిటీ చైర్మన్ కదిరికోట ఆదేన్న అన్నారు. శనివారం పెద్దమరివీడు గ్రామంలో పెద్దమరివీడు యూత్ స్వచ్ఛంధ సేవా సమితి అధ్వర్యంలో రక్త దాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరానికి ముఖ్యఅతిథిగా సీఐ గంగాధర్ హాజరై రక్త దానం చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు నరసన్నఆచారి, గౌస్, సేవా సమితి సభ్యులు లింగయ్య, విజయ్, నాగరాజు, నరసింహులు, ప్రకాస్, రాజేష్, మల్లికార్జున, శాంతిరాజు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

మంత్రాలయం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు జిల్లా అథ్లెటిక్ పోటీలో విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎన్నికైనట్లు పాఠశాల హెచ్ఎం వితోభరావు, ఫిజికల్ డైరెక్టర్లు రవీంద్ర, నరసింహరాజు తెలిపారు. శనివారం పాఠశాల ఆవరణలో జూనియర్ అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనబరిచి ఎన్నికైన విద్యార్థులకు కప్‌ను అందజేసి అభినందించారు. షాట్‌పుట్ విభాగంలో అండర్-15 పదో తరగతి చదువుతున్న వినయ్ కుమార్ 2వ స్థానంలో, 60 మీటర్ల పరుగు పందెంలో విశ్వనాథ్‌గౌడు 2వ స్థానం కైవసం చేసుకోవడంతో రాష్ట్ర స్థాయికి ఎంపికైయ్యారని తెలిపారు. 24వ తేదీ నుంచి 26 వరకు ఏలూరులో జరిగే రాష్ట్ర స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో గోట్ల చంద్రశేఖర్, గోపాల్, పాపన్న, శివశంకర్, రామదాసు పాల్గొన్నారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో కర్ణాటక హైకోర్టు జడ్జి

మంత్రాలయం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామిని శనివారం కర్ణాటక రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ హెచ్‌పీ సందేష్ దర్శించుకున్నారు. ఉదయం మహాముఖ ద్వారం వద్ద మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, సురేష్ కోనాపూర్, ఐపీ నరసింహామూర్తి జడ్జికి ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షింతలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. ఈయన వెంట అనంతపురాణిక్, జేపీ స్వామి, అనంతస్వామి, ప్రకాశ్ ఆచార్, పవన్ఆచార్, వ్యాసరాజార్, జయతీర్థ ఆచార్, తదితరులు ఉన్నారు.



జీఎస్టీ తగ్గుదలపై ప్రతి ఉద్యోగికి అవగాహన అవసరం


మాట్లాడుతున్న పీఠాధిపతి

మంత్రాలయం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఈ నెల 22 నుంచి తగ్గిస్తున్న జీఎస్టీ విధి విధానాల్లో అవగాహన కలిగి ఉండటం ఉద్యోగులకు అవసరమని శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు అన్నారు. శనివారం శ్రీమఠం గురు రాజాంగణ భవనంలో మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, సురేష్ కోనాపూర్, వెంకటేశ్ జోషీ, శ్రీపతాచార్ ఆధ్వర్యంలో జీఎస్టీ తగ్గిన వస్తువులపై శ్రీమఠం అన్ని శాఖల అధికారులతో అవగాహన వర్క్‌షాపు నిర్వహించారు. బెంగుళూరు చెందిన చార్టెడ్ అకౌంటెంట్ మోహన్‌రావు, బళ్లారి చెందిన బీకే అనిల్ కుమార్ ఉద్యోగులకు జీఎస్టీ తగ్గిన వస్తువులు, పెరిగిన వస్తువులు తేడాలను తెలియజేస్తూ శ్రీమఠంలోని అవసరమైన వస్తువులకు ఎంత మేర తగ్గుదల, ఎంత మేర పెరుగుదల జరిగిందన్న అంశంపై ప్రత్యేకంగా వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, ఆనందతీర్థాచార్, గౌతమాచార్, సుజీంద్రాచార్, రాజా ఎస్ అప్రమేయాచార్, కృష్ణ కౌశిక్, సీఆర్వోలు పాల్గొన్నారు.



విద్యాప్రమాణాల మెరుగుదలకు కృషి చేయాలి


మాట్లాడుతున్న ఉపాధ్యాయ శిక్షణ కళాశాల సీనియర్ ఉపాధ్యాయులు మారుతి

ఎమ్మిగనూరు, సెప్టెంబర్ 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు మెరుగుదలకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఉపాధ్యాయ శిక్షణ కళాశాల సీనియర్ ఉపాధ్యాయులు మారుతి పౌరోహితం అన్నారు. శనివారం ఎర్రకోట జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన క్లస్టర్ సమావేశానికి పరిశీలకుడిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వరసుగా మూడు రోజులు పాఠశాలకు హాజరుకాని పిల్లల వివరాలు సేకరించి వారిని పాఠశాలకు రప్పించటానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఎఫ్ ఏ1 మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయడాన్ని పూర్తిచేయాలని కోరారు. సిలబస్ పూర్తి చేయడం గురించి, పిల్లలు నోట్స్ రాయటం గురించి తనిఖీ చేశారు. అలాగే మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. క్లస్టర్ సమావేశంలో పాఠశాల హెచ్ఎం గౌసియా బేగం, ఝాన్సిరాణి పాల్గొన్నారు.

రేపటి నుంచి మంత్రాలయంలో దసరా ఉత్సవాలు

మంత్రాలయం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం పుణ్యక్షేత్రంలో 22 నుంచి దేవీ శరన్నవరాత్రోత్సవాలకు అన్ని సిద్ధం చేసినట్లు శ్రీమఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో 9 రోజుల పాటు గ్రామ దేవత మంచాలమ్మకు విశేష పంచామృతాభిషేకాలు, అర్చనలు, వివిధ రూపాల్లో అమ్మవారు భక్తులకు దర్శనం ఇస్తారన్నారు. 9రోజుల పాటు జరిగే ఉత్సవాలకు వచ్చే భక్తులకు వసతి, దర్శన క్యూలైన్లు, పరిమళ ప్రసాదం తాగు నీరు, పరిశుభ్రత వంటి ఏర్పాట్లు చేపట్టామని అన్నారు. దసరా ఉత్సవాల్లో అమ్మవారిని దర్శించుకుని రాఘవేంద్రస్వామిని కూడా దర్శించుకుని పీఠాధిపతి ఆశీస్సులు పొందాలని తెలిపారు.



సాంబశివరావుకు ఉత్తమ రైతు సేవా పురస్కారం


రైతు సేవా పురస్కారం అందుకుంటున్న సాంబయ్య

కోసిగి, సెప్టెంబరు 20(ఆంధ్ర జ్యోతి): మండల పరిధిలోని పల్లెపాడు గ్రామానికి చెందిన మాగులూరి సాంబశివరావు(సాంబయ్య)కు ఉత్తమ రైతు సేవా పురస్కారం శుక్రవారం హైదరాబాద్‌లో అందుకున్నాడు. 2015లో అరుణోదయ అగ్రిక్రాప్ సంస్థను ఏర్పాటు చేసి రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, ఒడిశా, మహరాష్ట్ర రైతులకు నాణ్యమైన అధిక దిగుబడులు ఇచ్చే విత్తనాలు అందించినందుకు గాను రైతులకు అండగా నిలిచారు. కెనడ దేశంకు చెందిన గ్లోబల్ ఫినాకిల్ ఫౌండేషన్ సభ్యులు సాంబయ్యకు సేవలను గుర్తించి ఆంధ్ర, తెలంగాణ ఎలైట్ బిజినెస్ అవార్డును ప్రకటించింది.

